

ఆంధ్రజ్యోతి
జగిత్యాల
జిల్లా వార్తలు
బుధవారం 17 సెప్టెంబరు 2025





ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

-జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో వసంత మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో విద్యార్థులు విద్య కోసం ఇక్కట్లు పడడం శోచనీయమన్నారు.

విద్యార్థుల ఉద్యమాలతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో వారిపై ప్రభుత్వం వివక్ష చూపడం సరికాదన్నారు. అసెంబ్లీ సాక్షిగా విడతల వారీగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో విద్యార్థుల చదువులు ప్రశ్నార్థకంగా మారాయని దావ వసంత అన్నారు. ఈ సమావేశంలో పలువురు బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.



ఆరోగ్య మహిళే లక్ష్యం

- నేటి నుంచి 'స్వస్త్ నారి... సశక్త్ పరివార్ అభియాన్' షురూ
- ప్రతి మహిళకు ఆరోగ్య పరీక్షలు
- జిల్లాలో 3 లక్షల మందికి ప్రయోజనం
- అక్టోబరు 2 వరకు వైద్య శిబిరాలు కొనసాగేలా ప్రణాళిక



జగిత్యాల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రజల ఆరోగ్యంపై దృష్టి సారించిన కేంద్ర ప్రభుత్వం నేషనల్ హెల్త్ మిషన్‌లో భాగంగా మరో నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈనెల 17వ తేదీ నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు దేశ వ్యాప్తంగా 'స్వస్త్ వారి సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమం అమలు చేయనుంది. ఇటీవల హైదరాబాద్ నుంచి సంబంధిత ఉన్నతాధికారులు అన్ని జిల్లాల కలెక్టర్లు, వైద్యాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి కార్యక్రమ విజయవంతానికి దిశా నిర్దేశం చేశారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను జిల్లా, మండల, గ్రామీణ స్థాయి వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది పూర్తి చేశారు.

● శిబిరాల నిర్వహణ ఇలా...

జిల్లాలో 24 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, అర్బన్ హెల్త్ సెంటర్లలో 69 మంది ప్రత్యేక వైద్య నిపుణులను అందు బాటులో ఉంచుతున్నారు. 13 పని దినాల్లో ఒక్కో రోజు నాలుగు వైద్య శిబిరాలను నిర్వహించడానికి ప్రణాళిక సిద్ధం చేశారు. జిల్లాలో మొత్తం 52 వైద్య శిబిరాలను నిర్వహించనున్నారు. 3లక్షల మంది మహిళలకు ప్రయోజనం కలిగేలా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఒక్కో రోజు ఒక్కో ప్రదేశంలో ఒక్కో స్పెషలిస్టు ఉండేలా శిబిరాల షెడ్యూల్ రూపొం దించారు. మొదట సీహెచ్‌సీ, పీహెచ్‌సీ తర్వాత ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల్లో శిబిరాలు కొనసాగుతాయి. పీహెచ్‌సీలో స్పెషలిస్టు వైద్యుడు ఉన్నప్పుడు ఆయా ప్రాంతాల ఆశా కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు మహిళలను శిబిరాలకు తీసుకొచ్చి వైద్యసేవలు అందించేలా కార్యాచరణ రూపొందించారు.



ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి భవనం

జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల వివరాలు

జనరల్ ఆసుపత్రి	1
ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు	17
24 గంటలు పనిచేసే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు	7
పల్లె దవాఖానాలు	102
బస్తీ దవాఖానాలు	9
అర్బన్ హెల్త్ సెంటర్లు	5
కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు	3
ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలు	151

● నిర్వహించే వైద్య పరీక్షలు...

జిల్లాలో నిర్వహించే వైద్య శిబిరాల్లో మహిళలకు పలు రకాల వైద్య పరీక్షలు చేయనున్నారు. ఇందులో ఈఎన్‌టీ, నేత్ర, రక్తపోటు, మధుమేహం, దంత పరీక్షలతో పాటు నోటి, రొమ్ము ఇతర కాన్సర్, రక్తహీనత, టెలిమానస్ సేవలు, గర్భిణులకు ఆరోగ్యం, సికిల్ సెల్ ఎనిమియా తదితర వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. మాతా శిశు సంరక్షణ (ఎంసీపీ) కార్డు, ప్రధానమంత్రి మాతృ వందన కార్యక్రమంలో పేర్లు నమోదు, సికిల్‌సెల్ కార్డు, పోషన్ ట్రాకర్‌లో లబ్ధిదారుల రిజిస్ట్రేషన్ తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పోషకాహారం గురించి వివరించడం, టేక్ హోమ్ రేషన్ (టీహెచ్‌ఆర్) పంపిణీ, పది శాతం చక్కెర, వంట నూనెలు తగ్గించడం వల్ల ఊబకాయాన్ని తగ్గించడం, శిశు సంరక్షణ, బాలల ఆహార పద్ధతులు తదితర అంశాల...

- మిగతా 8లో

ఈవీఎం గోదాంను తనిఖీ చేసిన కలెక్టర్



ఈవీఎం గోదాంను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్, అధికారులు

జగిత్యాల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని ఎస్ఆర్ఎస్‌పీ క్యాంపు శివారులో గల ఈవీఎం గోదాంను మంగళవారం కలెక్టర్ సత్యప్రసాద్ తనిఖీ చేశారు. ప్రతీ నెల చేసే తనిఖీల్లో భాగంగా ఈవీఎం గోదాంను కలెక్టర్ సత్య ప్రసాద్ సందర్శించినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గోదాము వద్ద ఎలాంటి లోపాలు లేకుండా పటిష్టమైన భద్రత ఉంచాలని, నిత్యం అప్రమత్తతతో పర్యవేక్షించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజాగౌడ్, జగిత్యాల ఆర్‌డీఓ మధుసూదన్, కలెక్టర్ కార్యాలయ ఎన్నికల విభాగం అధికారి హకీం, జగిత్యాల అర్బన్ తహసీల్దార్ రాంమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురికి రూ.5.20 కోట్ల నిధులు మంజూరు

-మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి నియోజకవర్గ అభివృద్ధికి రూ 5.20 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. హైదరాబాద్ నుంచి ఆయన ఆంధ్రజ్యోతితో ఫోన్ ద్వారా మాట్లాడుతూ నిధులు వివరాలు వెల్లడించారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రత్యేక శ్రద్ధతో నియోజకవర్గానికి భారీగా నిధులు మంజూరయ్యాయని ఆయన పేర్కొన్నారు. ధర్మారం నుంచి ఎండపల్లి క్రాస్ రోడ్ (కొత్తపల్లి బీటీ రోడ్డు నుంచి ఎండపల్లి బీటీ రోడ్డు) వరకు రూ.3.20 కోట్లు నిధులు మంజూరు అయ్యాయని ఆయన వివరించారు. జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గానికి సంబంధించిన పంచాయతీరాజ్ బ్రిడ్జి రోడ్డు నుంచి పందులగుట్ట, మద్దులపల్లె గ్రామం నుంచి పెగడపల్లికి రూ.2 కోట్లు నిధులు మంజూరు అయ్యాయని ఆయన తెలిపారు. నిధుల విడుదలపై సీఎం రేవంత్‌రెడ్డి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కకు మంత్రి లక్ష్మణ్‌కుమార్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

గోవులను సంరక్షించాలి

రాయికల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గోవులను సంరక్షించాలని గో సేవా సమితి రాయికల్ మండల సభ్యులు ఎనుగందుల రమేష్, శ్రీగద్దె సుమన్‌లు అన్నారు. రాయికల్ ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు ఆవుల పెంపకం వల్ల ప్రజలకు జరిగే మేలును వివరించారు. తెలంగాణ గో సేవా విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 17న రాయికల్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో గో విజ్ఞాన పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గోవు పర్యావరణ పరిరక్షణలో శాస్త్రీయ విజ్ఞానం అనే పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజశేఖర్, పద్మ, చెరుకు మహేశ్వర శర్మ, శోభ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి శిక్షణ

రాయికల్, సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలోని చిన్న జీయర్‌స్వామి ట్రస్ట్ భవన్‌లో ప్రతిమ ఫౌండేషన్, జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ సంయుక్తంగా మహిళలకు టైలరింగ్, హోమ్ ఎయిడ్ హెల్త్, పురుషులకు ఎలక్ట్రికల్ హౌజ్ వైరింగ్ కోర్సుల్లో 3 నెలల పాటు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ప్రతిమ ఫౌండేషన్ ఆర్గనైజర్ నాగిరెడ్డి రఘుపతి తెలిపారు. వీరికి ఉచిత వసతి, భోజన సౌకర్యంతో పాటు శిక్షణ అందించి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. టైలరింగ్ కోర్సులో చేరడానికి చదవడం, రాయడం వచ్చి ఉండాలన్నారు. హోం ఎయిడ్ హెల్త్, ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్ కోర్సుల్లో ప్రవేశానికి పదో తరగతి ఉత్తీర్ణులై 18-30 మధ్య వయస్సు గల వారు అర్హులన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 25లోపు 9963347142 నెంబర్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలి

కొడిమ్యాల, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విశ్వనాథరాజు అన్నారు. మంగళవారం మండలంలోని నాచుపల్లి జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ ఇంటర్నల్ 2025 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ విశ్వనాథరాజు మాట్లాడుతూ హ్యాకథాన్ కార్యక్రమంలో ఇంజనీరింగ్ విద్యార్థులు పాల్గొని అనుభవాన్ని పెంచుకోవాలన్నారు. విద్యార్థులు చేసిన ప్రజెంటేషన్లు వారి భవిష్యత్తుకు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఎస్‌వీవోసీ రాధాచరణ్, డాక్టర్ సురేష్ శ్రీపాద, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్ విశ్వనాథరాజు

'కమ్యూనిస్టుల నాయకత్వంలో సాయుధ పోరాటం'



నినాదాలు చేస్తున్న సీపీఐ నాయకులు, కార్మికులు

మెట్‌పల్లిటౌన్, సెప్టెంబర్ 16(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించింది కమ్యూనిస్టులేనని సీపీఐ మండల కార్యదర్శి ఉస్మాన్ అన్నారు. తెలంగాణ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ఘన నివాళులు అర్పించారు. అమరవీరుల చిత్రపటాలకు ఉస్మాన్‌తో పాటు మున్సిపల్ కార్మికులు పూలమాలలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆనాడు భూస్వాములకు, రజాకార్లకు ఎదురొడ్డి పోరాడిన కమ్యూనిస్టుల చరిత్ర ప్రతి ఒక్కరికీ తెలుసన్నారు. ఆనాటి భూస్వాముల ఆకృత్యాలకు బలైపోతున్న రైతుల పక్షాన నిలిచి పోరాటాన్ని కమ్యూనిస్టు నాయకులు నడిపారని తెలిపారు . ఆ పోరాటాల ఫలితంగానే సెప్టెంబర్ 17న తెలంగాణ భారతదేశంలో విలీనమైందన్నారు. తెలంగాణ విలీన దినోత్సవంను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక సంఘం అధ్యక్షుడు బర్ల లక్ష్మణ్ పాల్గొన్నారు

ఉపాధ్యాయుడిని బదిలీ చేయొద్దని వినతి

కథలాపూర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలంలోని పోసానిపేట ప్రాథమికోన్నత పాఠశాల నుంచి కరుణాకర్ అనే ఉపాధ్యాయుడిని చింతకుంటకు బదిలీపై పంపడాన్ని నిలిపివేయాలని మంగళవారం విద్యార్థుల తల్లిదండ్రులు ఎంఈవో లోకిని శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం పాఠశాల అభివృద్ధి చెందుతోందని ఈ పరిస్థితుల్లో టీచర్లను బదిలీ చేయవద్దని కోరారు. ఈ ఏడాది విద్యార్థుల సంఖ్య పెరిగిందని పేర్కొన్నారు. రేషనలైజేషన్ పేరిట బదిలీ చేస్తే పాఠశాల అభివృద్ధిపై ప్రభావం చూపుతుందని అన్నారు. బదిలీ ప్రక్రియను విరమించుకోవాలని వారు విన్నవించారు.

విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించాలి

జగిత్యాల అగ్రికల్చర్, సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించే విధంగా బోధనోపకరణాతో ఉపాధ్యాయులు పాఠాలు బోధించాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. విద్యార్థులకు సాధారణ విద్యతో పాటు, సాంకేతిక విద్యను అందించాలన్నారు. అప్పుడే విద్యార్థులు భవిష్యత్తులో అన్ని రంగాల్లో రాణిస్తారని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని స్థానిక పొన్నాల గార్డె న్‌లో విద్యాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ (టీఎల్‌ఎం) ప్రదర్శనను ఆయన తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరగతి గదుల్లో విద్యార్థులకు సులభతరంగా పాఠాలు బోధించేందుకు టీఎల్‌ఎంలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. వెనుక బడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సత్యప్రసాద్ ఉపాధ్యాయులకు సూచించారు. అంతకుముందు జిల్లా విద్యాధికారి రాము మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి మండలం నుంచి 10మంది చొప్పున 200 టీఎల్‌ఎంలు వచ్చాయని పేర్కొన్నారు. వీటిలో నుంచి స్టేట్ లెవల్‌కు ఎనిమిది ఎంపిక చేసి పంపిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్ర మంలో అదనపు కలెక్టర్ రాజాగౌడ్, జిల్లా సమగ్ర శిక్ష కోఆర్డినేటర్లు, పలువురు ఎంఈవోలు పాల్గొన్నారు.



టీఎల్‌ఎం ప్రదర్శనను తిలకిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

'ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు'

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ అశోక్ కుమార్ పేర్కొన్నారు. ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థులకు ర్యాగింగ్ వలన కలిగే దుష్పరిణామాలపై స్థానిక ఐఎంఏ హాలులో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు స్నేహ పూర్వక వాతావరణంలో చదువుకోవాలని కోరారు. సీనియర్లు జూనియర్లకు ప్రోత్సాహంతో పాటు మార్గనిర్దేశం చేయాలన్నారు. ఎవరైనా ర్యాగింగ్ బాధితులుగా మారితే ఎలాంటి భయం లేకుండా 100 డయల్‌కు సమాచారం అందిం చాలని కోరారు. కళాశాలలో యాంటీ ర్యాగింగ్ కమిటీలు ఏర్పాటు చేయాలని సంబంధిత ప్రిన్సిపాల్‌కు సూచించారు. అనంతరం విద్యార్థులకు ర్యాగింగ్ వల్ల కలిగే పరిణామాలపై ఎస్పీ అవగాహన కల్పించారు. పలు ప్రశ్నలకు సరైన సమాధానాలు చెప్పిన విద్యార్థులకు ఎస్పీ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రఘుచందర్, సీఐ కరుణాకర్, కళాశాల సూపరింటెండెంట్ రాజ్‌గోపాల్ తదితరులు ఉన్నారు.



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

గొర్రె పిల్ల అపహరణపై కేసు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి గ్రామంలోని గొర్రెల మంద నుంచి గుర్తు తెలియని వ్యక్తులు గొర్రె పిల్లను అపహరించిన సంఘటనపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి మంగళవారం తెలిపారు. తన గొర్రెల మంద నుంచి గుర్తు తెలియని వ్యక్తులు రూ.6 వేల విలువైన గొర్రె పిల్లను ఎత్తుకెళ్లారని బాధితురాలు బాలమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని తెలిపారు.

విద్యుత్ తీగ చోరీ

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం సింగారం గ్రామ శివారులోని రైతు ధర్మాగౌడ్‌కు చెందిన వ్యవసాయ విద్యుత్ తీగను గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన సంఘటనపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి మంగళవారం పేర్కొన్నారు. గ్రామంలోని తన వ్యవసాయ పొలం వద్ద ఉన్న రూ.30 వేల విలువైన విద్యుత్ తీగను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారని రైతు ధర్మాగౌడ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి చేసినట్లు తెలిపారు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న ఎక్స్‌కావేటర్, టిప్పర్ పట్టివేత


శంకరపట్నం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మట్టి తరలిస్తున్న ఎక్స్‌కావేటర్, టిప్పర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు కేశవపట్నం పోలీసులు తెలిపారు. హుజూరాబాద్ మండలానికి చెందిన రాపోలు కుమార్, వేణు అనే వ్యక్తులు ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఎక్స్‌కావేటర్, టిప్పర్‌తో మట్టి తరలిస్తుండగా కొత్తగట్టు శివారులో పోలీసులు పట్టుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కరీంనగర్ టాస్క్‌ఫోర్స్‌లో భారీ ప్రక్షాళన

తొమ్మిది మంది సిబ్బంది తొలగింపు

అవినీతి ఆరోపణలే కారణమా?

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పోలీస్ కమిషనరేట్‌లో అక్రమ దందాలపై దాడులు, అక్రమార్కులను పట్టుకునేందుకు ప్రత్యేకంగా ఏర్పాటైన టాస్క్‌ఫోర్స్ సిబ్బందిలో భారీ మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఇసుక అక్రమ దందా, పేకాట, వ్యభిచారం, గంజాయి అక్రమ రవాణా, అమ్మకాలు, మద్యం అక్రమ అమ్మకాలు, గుడుంబా, నాటుసారా, డ్రగ్స్, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా, కల్తీ వంట నూనె, ఆహార పదార్థాలు వంటి దందాలపై ఉక్కుపాదం మోపి, నేరస్థులను కటకటాల్లోకి నెట్టేందుకు దశాబ్దాల కాలంగా టాస్క్‌ఫోర్స్ విభాగం కమిషనరేట్‌లో కొనసాగుతున్నది. పోలీస్ కమిషనర్ ఆధ్వర్యంలో ఈ టాస్క్‌ఫోర్స్ పోలీసు టీం పని చేస్తుంటుంది.



పోలీస్ కమిషనర్‌తో పాటు స్పెషల్ బ్రాంచి, ఇతర విభాగాలకు అంది న సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు రంగంలోకి దిగి నేరస్థుల ఆటకట్టిస్తుంటారు. పోలీస్ స్టేషన్ల పరిధిలో నడు స్తున్న అక్రమ దందాలపై టాస్క్‌ఫోర్స్ నేరుగా దాడులు నిర్వహించి నిందితులను స్థానిక పోలీసులకు అప్పగిస్తుంది. స్థానిక పోలీ సులకు ఉన్న పరిచయాలతో కొన్ని సందర్భాల్లో కొన్ని అక్రమ దందాలను స్థానిక పోలీసులు పట్టించుకోరనే విమర్శలు న్నాయి. ఈ సందర్భంలో టాస్క్ ఫోర్స్ పోలీసులు రంగంలోకి దిగి అక్రమ దందాలను అరికడ తారు. టాస్క్ ఫోర్స్ పోలీసులు నేరుగా పోలీస్‌కమిషనర్‌కు అనుబంధంగా ఉంటారుకాబట్టి ఎలాంటి అవకతవకలకు తావు ఉండదనే భావన ఉంది.


సీపీ ప్రత్యేకంగా దృష్టి సారించి..

కరీంనగర్ టాస్క్‌ఫోర్స్‌లో పనిచేస్తున్న కొంతమంది సిబ్బందిపై ఇటీవల అవినీతి ఆరోపణలు వచ్చినందునే సిబ్బందిని పూర్తిగా తొల గించినట్లు తెలుస్తోంది. టాస్క్‌ఫోర్స్‌లో ఒక ఏసీపీ, సీఐ, ఎస్‌ఐ, ఏఎస్‌ఐ, ఏడుగురు కానిస్టేబుళ్లు పనిచేస్తున్నారు. ఇందులో ఎస్‌ఐ, ఏఎస్‌ఐతో సహా ఏడుగురు కానిస్టేబుళ్లను తొలగించిన పోలీస్ కమిషనర్ వారిని హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేయాలని సోమవారమే మౌఖిక ఆదేశాలే జారీ చేశారు. కొద్ది రోజుల కిందట నిషేధిత గుట్కాను భారీ ఎత్తున పోలీసులు పట్టుకున్నారు. అంతకు ముందు పీడీఎస్ బియ్యం, గంజాయి, పేకాట శిబిరాలపై దాడులు చేసిన సందర్భాల్లో కొంత అవకత వకలు జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

ముఖ్యంగా పేకాట శిబిరాలపై దాడులు చేసిన సమయాల్లో కొందరిని తప్పించడం, నిర్వాహకులపై కేసులు నమోదు చేయ కపోవడం, డబ్బుల లెక్కల్లో కూడా తేడా రావడంపై ఆరోపణలు ఉన్నాయి. టాస్క్‌ఫోర్స్ దాడులు చేసిన ఘటనల్లో అవినీతికి పాల్పడినట్లు పోలీస్ కమిషనర్‌కు పక్కాగా సమాచారం ఉండడంతోపాటు, ఫిర్యాదులు కూడా అందినందునే ఈ చర్యలు తీసుకున్నారని తెలిసింది. కొద్ది రోజులుగా టాస్క్‌ఫోర్స్ సిబ్బంది కదలికలపై ప్రత్యేక పోలీసు లతో నిఘా పెట్టారు. ఆరోపణలు నిర్ధారణ అయిన వెంటనే తొమ్మిది మందిని తొలగించారు. టాస్క్‌ఫోర్స్ విధుల నుంచి తొలగించిన 9 మంది మంగళవారం ఏఆర్ ఆర్‌ఐకి రిపోర్ట్ చేశారు.

ముందుగానే సమాచారం లీక్

కొత్తగా టాస్క్‌ఫోర్స్‌లో నియామకాల కోసం అవినీతి మరకలు లేని సిబ్బందిని ఎంపిక ప్రక్రియ జరుగుతున్నది. గతంలో కూడా చాలా సంద ర్భాల్లో పేకాట శిబిరాలపై టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులు దాడి చేసిన సంద ర్భాల్లో నిందితులు అక్కడి కొన్ని నిమిషాల ముందే తప్పించుకునేవారు. సమా చారం అందించినవారికి అనుమానం కలిగే ది. అయినా ఏమీ చేయలేని పరిస్థితి. ఇంకా కొన్ని ఘటనల్లో సమాచారం అందించినవారి పేర్లు కూడా బయటకు వచ్చాయని చెబుతుండేవారు. స్థానిక పోలీసులకు ఉన్న ఒక రకమైన స్నేహం వల్లనే పట్టించుకోరనే వాదన ఉండేది. నిక్కచ్చిగా, నిజాయితీగా వ్యవహరిస్తారని భావిస్తున్న టాస్క్‌ఫోర్స్‌తో కూడా సరైన న్యాయం జరగడం లేదనే భావన కొందరిలో ఉంది. దీని కారణంగా అక్రమ కార్యకలా పాల గురిం చి, అసాంఘిక శక్తుల వివరాలు పోలీసులకు అందించేందుకు ఇది సమస్యగా మారు తుందని గుర్తించిన సీపీ దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించినట్లు తెలుస్తోంది. కమిషనరేట్ పరిధిలోని పలు స్టేషన్లలో కూడా కొందరు సిబ్బంది ఇదే విధంగా వ్యవహరిస్తు న్నారనే ఆరోపణలు న్నాయి. వీటిపై కూడా పోలీస్ కమిష నర్ దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.



ట్రాఫిక్ జరిమానా చెల్లించిన పోలీసుశాఖ డ్రైవర్లు

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ ఉల్లంఘ నకు సంబంధించి పోలీసు శాఖ డ్రైవర్లు మంగళవారం జరిమానా చెల్లించారు. కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లఘించడంతో పోలీసు వాహనాలకు చలాన్‌ల రూపంలో జరిమానాలు పడ్డాయి. ఈ జరిమానాలను వాహనం నడిపిన పోలీసుశాఖ డ్రైవర్లే చెల్లించాలని సీపీ గౌస్ ఆలం ఆదేశించారు. దీంతో కమిషనరేట్ వ్యాప్తంగా ఆయా వాహనాలకు చెందిన 25 మంది డ్రైవర్లు చలాన్ రూపంలో జరిమానా చెల్లించారు. పోలీసు అధికారులు, సిబ్బంది ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ఆదర్శంగా ఉంటేనే ప్రజలు అనుసరిస్తారనే ఉద్దేశంతో ఈ చర్యలకు ఉపక్రమించారు.

అంధ విద్యార్థుల వీడియో ఆల్బమ్‌ను ఆవిష్కరించిన సీఎం

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ అంధుల పాఠశాల విద్యార్థులు పాడి రూపొందించిన దివ్యదృష్టి వీడియో ఆల్బమ్‌ను సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ విద్యార్థులు రాగయుక్తంగా స్తోత్రాలను ఆలపించడం ఆనందాన్నిచ్చిందన్నారు. ఎంతో కృషి అభ్యాసం ఉంటే తప్ప ఇది సాధించలేరని, చిన్నారులు వృద్ధిలోకి రావాలని ఆశీర్వదించారు. కలెక్టర్ పమేలా సత్పతి విద్యారంగంలో చిన్నారులను ప్రోత్సహించడం ఆదర్శనీయమన్నారు. వీడియో ఆల్బమ్‌కు దర్శకత్వం వహించిన నంది శ్రీనివాస్, సంగీతాన్ని అందించిన కె.బి.శర్మ, సంగీత ఉపాధ్యాయిని సరళ, వీడియోగ్రఫీ చేసిన లక్ష్మీగౌతమ్‌ను సీఎం అభినందించారు. అనంతరం కలెక్టర్ విద్యార్థులతో కలిసి సచివాలయాన్ని సందర్శించారు. కరీంనగర్ ఫిలిం సొసైటీ అధ్యక్షుడు పొన్నం రవిచంద్ర సమన్వయంతో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ పమేలా సత్పతి, చిన్నారి గాయకులు సింధుశ్రీ, శ్రావణి, తిరుమల, అఖిల, నిత్యశ్రీ, జాహ్నవి, కల్పన, ప్రణయ్, సాయిరామ్, మణిదీప్, అక్షయ్, వరుణ్‌తేజ్, మణిరతన్, లోహిత్, ప్రభుత్వ బధిరుల పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

గల్ఫ్‌లో కొత్తపల్లి వాసి మృతి



రాజయ్య(ఫైల్)

గంభీరావుపేట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన రాజయ్య (70) అనే వ్యక్తి గల్ఫ్‌లో గుండెపోటుతో మృతిచెందాడు. రాజయ్య 15 ఏళ్లుగా సౌదీ వెళుతున్నాడు. ఈ నెల 13న రాజయ్య గుండెపోటుకు గురై మృతిచెందినట్లు కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం అందింది. రాజయ్య మృతదేహాన్ని స్వగ్రామానికి తెప్పించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

వాహనాల తనిఖీ

- సరైన పత్రాలు లేని 21 వాహనాలు సీజ్



వాహనాలు తనిఖీ చేస్తున్న డీటీవో

తిమ్మాపూర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా రవాణాశాఖ, ట్రాఫిక్ పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో కరీంనగర్‌లో నూతనంగా ఎంపికైన అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్స్‌పెక్టర్లకు శిక్షణలో భాగంగా మంగళవారం వాహనాల తనిఖీ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించినట్లు కరీంనగర్ జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి శ్రీకాంత్ చక్రవర్తి తెలిపారు. ఈ తనిఖీల్లో భాగంగా డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, ఇతర పత్రాలు లేని 21 వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. సుమారు 75వేల రూపాయల వరకు జరిమానా విధించినట్లు శ్రీకాంత్ చక్రవర్తి తెలిపారు. ప్రతి వాహనాదారుడు తమ వాహనాల పత్రాలను సరిచూసుకోవాలని సరియైన పత్రాలు లేనిదే రోడ్డు పైకి వస్తే జరిమానాతో పాటు వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ తనిఖీల్లో ట్రాఫిక్ సిఐలు పర్శ రమేష్, ఆర్‌ఐ కుమారస్వామి, ఎస్సైలు, ట్రైనీ ఏఎంవీఐలు పాల్గొన్నారు.

గంజాయి కేసులో నిందితుడి అరెస్టు

- 43గ్రాముల గంజాయి, ద్విచక్రవాహనం స్వాధీనం

ఇల్లంతకుంట, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి) : గంజాయి కేసులో మండల కేంద్రానికి చెందిన మామిడి శ్రీకాంత్ (27)ను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు సిరిసిల్ల రూరల్‌సీఐ మొగిలి తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. కారు డ్రైవర్‌గా పనిచేస్తున్న శ్రీకాంత్ జల్సాలకు అలవాటు పడటంతో డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో గంజాయికి అలవాటుపడటమే కాకుండా వ్యాపారం చేయాలనుకున్నాడు. ప్రస్తుతం కరీంనగర్‌కు చెందిన అరవింద్ వద్ద గంజాయిని మూడు రోజుల క్రితం కొనుగోలు చేసి ఇంటికి తీసుకవచ్చాడు. కొంత గంజాయిని తాగి మిగిలిన దానిని అమ్మడానికి మంగళవారం ద్విచక్రవాహనంపై వెళుతుండగా జంగమరెడ్డిపల్లె కమాన్ వద్ద పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేశాడు. శ్రీకాంత్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా 43 గ్రాముల గంజాయి దొరికింది. గంజాయి, ద్విచక్రవాహనం, మొబైల్‌ఫోన్ స్వాధీనం చేసుకొని కేసునమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్సై లక్‌పతి పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): హత్య కేసులో వేములవాడ అర్బన్ పరిధిలోని చింతల్‌ఠాణాకు చెందిన మంత్రి ఆనందంకు జీవిత ఖైదు రూ.1000 జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి. నీరజ మంగళవారం తీర్పు వెల్లడించారు. ఎస్పీ మహేష్ బి. గీతే తెలిపిన వివరాల ప్రకారం... జూలపల్లి మండలంలోని తేలుకుంటకు చెందిన మర్రిపెల్లి రాజయ్య(64) అనే వ్యక్తి వేములవాడ శివారులోని ఓ మామిడితోటలో తోటకాపరిగా ఉన్నాడు. ఇతనితో పాటు మంత్రి ఆనందం తోటకాపరిగా పనిచేస్తుండేవాడు. వీరి మధ్య తరచుగా తోటపని విషయంలో గొడవలు జరిగేది. ఈ గొడవల్లో భాగంగా ఏప్రిల్ 29,2024న రాత్రి అంతకుముందు తిట్టిన విషయంను ఆనందం మనసులో పెట్టుకొని ఇనుపరాడుతో రాజయ్య తలపై బాది హత్యచేశాడు. రాజయ్య కుమారుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా కోర్టు కానిస్టేబుల్ మహేందర్ నవీన్‌లు కోర్టులో 16మంది సాక్షులను ప్రవేశపెట్టారు. పీపీ పెంట శ్రీనివాస్ కేసు వాదించగా పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడిపై నేరం రుజువు కావడంతో జీవితఖైదుతో పాటు రూ.1000 జరిమానా విధించారు. శిక్ష పడటంలో కృషి చేసిన వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్‌ను, పీపీ పెంట శ్రీనివాస్, కోర్టు మానిటరింగ్ ఎస్‌ఐ రవీంద్రనాయుడు, కానిస్టేబుళ్లు మహేందర్, నవీన్‌లను ఎస్పీ అభినందించారు.

కొనుగోళ్ల కమీషన్‌లో అవకతవకలపై నిలదీత

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మహిళా సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన కొనుగోళ్లకు సంబంధించిన కమీషన్‌లో పలు అవకతవకలు చోటు చేసుకున్నాయని, లెక్కలు చెప్పాలంటూ సభ్యులు, స్థానికులు మంగళవారం ఆందోళనకు దిగారు. వీర్నపల్లి మండలం వన్‌పల్లి గ్రామంలో మంగళవారం ఐకేపీ అధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఇటీవల గ్రామైఖ్య సంఘం వారు వరి ధాన్యం కొనుగోలు చేశారని అందుకు వచ్చిన కమీషన్ లెక్కలు చెప్పకుండా దాట వేస్తున్నారని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కమీషన్, ఇతర లెక్కలు తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటామని పేర్కొంటూ సమావేశాన్ని ఈ నెల 22వ తేదీకి వాయిదా వేస్తున్నామని ఐకేపీ ఏపీఎం సుదర్శన్ వివరించడంతో శాంతించారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

మల్యాల, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మల్యాల బ్లాక్ చౌరస్తా సమీపంలో మంగళవారం ఓ ఇంట్లో చోరీ జరిగింది. కట్టెకోల మల్లేశ్వరి అనే మహిళ అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం రామన్నపేటలో తన అక్క ఇంటికి వెళ్లింది. మంగళవారం ఇంటికి రాగా వెనుకాల గేట్ గొలుసు పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూస్తే బీరువాలోని తులం బంగారు ఆభరణాలు, పది తులాల వెండితో పాటు రూ.10 వేల నగదు దొంగలు ఎత్తు కెళ్లినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందిం చింది. ఎస్సై ఏ.నరేశ్‌కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ.300 కోసం ఆటో డ్రైవర్ హత్య

- కిరాయి చెల్లింపు విషయంలో వాగ్వాదం
- వివరాలు వెల్లడించిన జగిత్యాల డీఎస్పీ రఘుచందర్



మృతుడు నయిమొద్దీన్ (ఫైల్)

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం హైదర్‌పల్లి సమీపంలో రూ.300 కోసం ఆదివారం అర్ధరాత్రి ఆటో డ్రైవర్ నయిమొద్దీన్(50)ను బీహార్‌కు చెందిన ఇద్దరు కూలీలు బండరాయితో మోది దారుణంగా హత్య చేశారు. నిందితులైన దర్శన్ సాహ్నీ, సునీల్ సాహ్నీలను పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. జగిత్యాల రూరల్ సీఐ కార్యాలయంలో మంగళవారం విలేకర్ల సమావేశంలో డీఎస్పీ రఘుచందర్ హత్య కేసు వివరాలను వెల్లడించారు. జగిత్యాల పట్టణంలోని సుతారిపేటకు చెందిన ఎండీ నయిమొద్దీన్ పట్టణంలో ఆటో నడుపుతూ జీవిస్తున్నాడు. బీహార్ రాష్ట్రానికి చెందిన దర్శన్‌సాహ్నీ, సునీల్ సాహ్నీ, పంకజ్ అనే ముగ్గురు జగిత్యాల మండలం హైదర్‌పల్లి, పొలాస శివారులో గల రైస్ మిల్లుల్లో కూలీలుగా పనిచేస్తున్నారు. ఆదివారం అర్ధరాత్రి జగిత్యాల నుంచి వారు పనిచేసే రైస్ మిల్లులకు వెళ్లేందుకు ముగ్గురు బీహార్ కూలీలు నయిమొద్దీన్ ఆటోను అద్దెకు మాట్లాడుకున్నారు. పంకజ్ అనే బీహార్ కూలీ పొలాస దగ్గర దిగిపోయి ఆటో కిరాయి మిగిలిన వారు ఇస్తారని డ్రైవర్‌తో చెప్పాడు. ఆటో హైదర్‌పల్లిలోని రైస్‌మిల్లు సమీపంలోకి రాగానే ఆటో డ్రైవర్ నయిమొద్దీన్ బీహార్ కూలీలైన దర్శన్ సాహ్నీ, సునీల్ సాహ్నీలను కిరాయి డబ్బులు అడిగాడు.



హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రఘుచందర్

ఈ క్రమంలో వారి మధ్య వాగ్వాదం జరిగి ఘర్షణకు దారి తీసింది. ఈ క్రమంలోనే మాటామాటా పెరిగి ఆటోడ్రైవర్ నయిమొద్దీన్ గొంతును టవల్‌తో దర్శన్ సాహ్నీ అనే కూలీ బిగించగా మరో నిందితుడు సునీల్ సాహ్నీ బండరాయితో దాడిచేసి హత్య చేశాడు. అనంతరం మృతదేహాన్ని రోడ్డు పక్కన ఉన్న కాలువలో పడేశారు. మృతుడు నయిమొద్దీన్ సోదరుడు ఇసాక్‌ఖాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న జగిత్యాల రూరల్ పోలీసులు విచారణ చేపట్టారు. సీసీ ఫుటేజీలు, సాంకేతిక పరిజ్ఞానం ద్వారా హత్య కేసును ఛేదించి నిందితులను పట్టుకున్నారు. నిందితుల వద్ద నుంచి మృతుడు నయిమొద్దీన్ మొబైల్‌ను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ రఘుచందర్ తెలిపారు.

యువతి ఆకస్మిక మృతి

జ్యోతినగర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ పర్మినెంటు టౌన్‌షిప్ (పీటీఎస్)లో మంగళవారం పొగిడి అనూష(29) అనే యువతి మృతి చెందింది. అనూష మృతిపై ఎన్టీపీసీ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఎన్టీపీసీ సంస్థలో అధికారిగా పనిచేస్తున్న పొగిడి జయరాజు పీటీఎస్‌లోని డి టైపు క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్నాడు. జయరాజు కుమార్తె అనూష కొంత కాలంగా మానసికంగా ఇబ్బందిపడుతోంది. ఈ క్రమంలో మంగళవారం ఉదయం కుమార్తె నిద్ర లేవకపోవడతో ఆమెను లేపే ప్రయత్నం చేశాడు. కదలికలు లేకపోవడంతో అనూషను టౌన్‌షిప్‌లోని ఎన్టీపీసీ ధన్వంతరి ఆసుపత్రికి తీసుకువెళ్లారు. ఆమెను పరిశీలించిన వైద్యులు అప్పటికే చనిపోయినట్లు ప్రకటించారు. విషయాన్ని జయరాజు ఎన్టీపీసీ పోలీసుకు తెలిపారు. ఎన్టీపీసీ ఎస్‌ఐ టి.ఉదయ్‌కిరణ్ సంఘటన స్థలానికి వెళ్లి విచారించారు. అనూష మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గోదావరిఖని ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేశారు.

చోరీలకు పాల్పడుతున్న విద్యార్థి అరెస్టు

కోల్‌సిటీ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): జల్సాలకు అలావాటు పడి, డబ్బుల కోసం చోరీలకు పాల్పడుతున్న డిగ్రీ విద్యార్థి కవ్వంపల్లి అరుణ్ కుమార్(20)ని మంగళవారం అరెస్టు చేసినట్టు డీసీపీ కరుణాకర్ పేర్కొన్నారు. గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన అరెస్టు వివరాలను వెల్లడించారు. గోదావరిఖని పట్టణంలోని విఠల్‌నగర్‌లో ఈ నెల 10, 11తేదీల్లో రాత్రి ఇళ్లలో గుర్తు తెలియని వ్యక్తి చోరీలకు పాల్పడ్డాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి ఎస్‌ఐలు, క్రైమ్ పార్టీ సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం పైవింక్లయిన్ వద్ద అనుమానస్పదంగా తిరుగుతున్న అరుణ్‌కుమార్‌ను పట్టుకున్నారు. అతన్ని విచారించగా తాను డిగ్రీ విద్యార్థినని, చెడు అలవాట్లకు బానిసై జల్సాలకు డబ్బుల కోసం చోరీలకు పాల్పడినట్టు తెలిపాడన్నారు. తాళం వేసిన ఇండ్లను గుర్తించి వెనుక డోర్లు పగులగొట్టి చోరీలకు పాల్పడేవాడన్నారు. దొంగిలించిన సొత్తును విక్రయించి జల్సాలు చేస్తున్నట్టు పోలీసులు పేర్కొన్నారు. అతని వద్ద నుంచి 23.6గ్రాముల బంగారు ఆభరణాలు, 45తులాల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ సొత్తు విలువ రూ.1.93లక్షలు ఉంటుందని డీసీపీ పేర్కొన్నారు.

చోరీ సొత్తు కొన్నా, తాకట్టు పెట్టుకున్నా కేసులే..

చోరీ సొత్తును ఎవరైనా కొనుగోలు చేసినా, తాకట్టు పెట్టుకున్నా వారిపై కేసులు నమోదు చేస్తామని డీసీపీ పేర్కొన్నారు. ప్రైవేట్ గోల్డ్‌లోన్ కంపెనీలు తాకట్టు పెట్టుకునే సమయంలో అన్ని విచారణలు జరుపాలని, వివరాలు తీసుకోవాలన్నారు. అలా కాదని చోరీ సొత్తును తాకట్టు పెట్టుకుంటే కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కేసును ఛేధించడంలో కీలకంగా వ్యవహరించిన ఎస్‌ఐ అనూష, క్రైమ్ పార్టీ హెడ్ కానిస్టేబుల్ రమేష్, సదానందం, కానిస్టేబుళ్లు మధుకర్, మధుసూధన్, రమేష్‌లకు డీపీసీ క్యాష్ రివార్డు అందజేశారు. ఏసీపీ రమేష్, సీఐ ఇంద్రసేనారెడ్డి పాల్గొన్నారు.

ఇసుక కోసం వెళ్లి.. మానేరులో చిక్కుకొని

- కాపాడిన స్థానికులు, పోలీసులు

సుల్తానాబాద్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలంలోని గట్టెపల్లికి చెందిన కొందరు ట్రాక్టర్ యజమానులు, కూలీలు ఇసుక కోసం ట్రాక్టర్లతో మానేరు వాగులోకి మంగళవారం ఉదయం వెళ్ళారు. కరీంనగర్‌లోని ఎల్‌ఎండీ నుంచి నీరు విడుదల చేసిన విషయం వారికి తెలియదు. మహిళతో పాటు ఎనిమిది మంది వాగులో ఇసుక నింపుతుండగా ఒక్కసారిగా నీటి ఉధృతి పెరగడంతో చిక్కుకుపోయారు. వారు బయటకు రాలేని దుస్థితి నెలకొంది. ప్రవాహంలో ట్రాక్టర్లు కొట్టుకుపోయాయి. బాధితులు పెద్దగా కేకలు వేయడంతో వాగు ఒడ్డున ఉన్న వారు సహాయక చర్యలు చేపట్టి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ సుబ్బారెడ్డి, ఎస్‌ఐ శ్రావణ్ కుమార్ మానేరు వాగు వద్దకు వచ్చి స్థానికుల సహాయంతో వాగులో ఉన్న వారిని తాళ్లతో బయటకు తీసుకువచ్చారు.



గట్టెపల్లి మానేరు వాగులో చిక్కుకున్న వారిని తాళ్లతో బయటకు తీస్తున్న స్థానికులు

- ఎవరూ వాగులోకి వెళ్ల వద్దు

ఎవరూ మానేరు వాగులోకి వెళ్లవద్దని సీఐ సుబ్బారెడ్డి, ఎస్‌ఐ శ్రావణ్ కుమార్‌లు హెచ్చరించారు. మానేరు పరివాహక ప్రాంత గ్రామాలకు చెందిన ఇసుకను తరలించే ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లు కూలీలతో సమావేశం నిర్వహించి మానేరు గేట్లు ఎత్తడంతో నీటి ఉధృతి పెరిగిందని ప్రమాదకరంగా ఉందన్నారు. రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

అర్కండ్ల వాగులో కొట్టుకుపోయి.. సురక్షితంగా ఒడ్డుకు



అర్కండ్ల వాగులో కొట్టుకుపోతున్న వ్యక్తి

శంకరపట్నం: మండలం అర్కండ్ల లోలెవెల్ బ్రిడ్జిపై నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తి జారిపడి నీటి ప్రవాహంతో కొంత దూరం కొట్టుకుపోయి సురక్షితంగా బయటపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అర్కండ్ల లో లెవెల్ బ్రిడ్జిపై నుంచి నీరు భారీగా ప్రవహిస్తుండగా ఓ వ్యక్తి నడుచుకుంటూ వాగు దాటే ప్రయత్నం చేశాడు. లో లెవెల్ బ్రిడ్జి నాచు పట్టి ఉండడంతో జారిపడి నీటి ప్రవాహంలో కొంత దూరం కొట్టుకుపోయాడు. ఆధారం దొరకగానే ఈదుకుంటూ బయటకు సురక్షితంగా చేరాడు. వాగుపై బ్రిడ్జి నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఇల్లందకుంట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై నుంచి కింద పడి తలకు తీవ్ర గాయాలై చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందినట్లు ఎస్‌ఐ క్రాంతి కుమార్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మొగుళ్లపల్లి మండలంలోని పిడిసిల్ల గ్రామానికి చెందిన మాదం రత్నాకర్ (40) తన ద్విచక్ర వాహనంపై పిడిసిల్ల నుంచి కల్లుపల్లెకు ఈ నెల 12న వెళ్తుండగా బూజునూర్ గ్రామంలో కుక్కలు అడ్డు రాగా బైక్‌పై నుంచి జారి కిందపడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కరీంనగర్ అర్బన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మంగళవారం పట్టుకున్నట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. కరీంనగర్ రూరల్ మండలం గోపాల్‌పూర్ క్రాస్‌రోడ్ వద్ద ట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు.

భార్యను హతమార్చిన భర్త అరెస్టు

- పరారీలో అత్తమామలు

కోల్‌సిటీ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): రామగిరి మండలం పన్నూరు గ్రామ పంచాయతీ పరిధిలోని వకీల్‌పల్లి ప్లాట్స్‌లో ఈ నెల 14న మేడి రమాదేవి అలియాస్ పూసాల ప్రశాంతి హత్య కేసులో నిందితుడు ఆమె భర్త పూసాల కృపాకర్ అలియాస్ ప్రభాకర్ (45)ను మంగళవారం అరెస్టు చేసినట్టు డీసీపీ కరుణాకర్ పేర్కొన్నారు. మంగళవారం గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన అరెస్టు వివరాలను వెల్లడించారు. ఈ నెల 14న ఉదయం ప్రశాంతిని ఆమె భర్త హత్య చేశాడని, గోదావరిఖని ఏసీపీ రమేష్ ఆధ్వర్యంలో రామగిరి ఎస్‌ఐలు శ్రీనివాస్, దివ్యలు ప్రత్యేక టీములతో నిందితున్ని లద్నాపూర్ వద్ద పట్టుకున్నారన్నారు. ఈ కేసులో మరో ఇద్దరు నిందితులు కృపాకర్ తల్లిదండ్రులైన శ్యామల, రంగయ్యలు పరారీలో ఉన్నారన్నారు. మంచిర్యాల రెడ్డి కాలనీకి చెందిన రమాదేవి అలియాస్ ప్రశాంతిని పన్నూరు గ్రామ పంచాయతీ పరిధిలోని వకీల్‌పల్లి ప్లాట్‌లో నివాసముండే పూసాల కృపాకర్ వేరు వేరు సామాజికవర్గాలకు చెందిన వారు 13ఏళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడన్నారు. వీరికి కుమారుడు



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ కరుణాకర్

జాన్సన్(10), కుమార్తె జోషిత్(9), జ్యోత్స్న(7)లు ఉన్నారు. ఏడాదిగా వీరి మధ్య కుటుంబ కలహాలు జరుగుతున్నాయి. అప్పటి నుంచి భార్యభర్తలు వేరువేరుగా ఉంటున్నారు. ఈ నెల 14న రమాదేవి కృపాకర్ ఇంటికి వచ్చిందని, ఈ క్రమంలో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగిందన్నారు. రమాదేవిని చంపితేనే సమస్య పరిష్కారమవుతుందని భావించి కృపాకర్ ఆమెపై కత్తితో దాడి చేశారన్నారు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందినట్టు డీసీపీ తెలిపారు. అత్తమామలు పరారీలో ఉన్నారని, విచారణ జరుగుతుందన్నారు. సమావేశంలో గోదావరిఖని ఏసీపీ రమేష్, వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, రామగిరి ఎస్‌ఐ శ్రీనివాస్, దివ్య పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలి

- వాగులో కూర్చొని యువకుడి నిరసన



వాగు నీటిలో కూర్చున్న మోహన్

చందుర్తి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వంతెనల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని ఓ యువకుడు ఎనగల్ గ్రామంలో వాగులో కూర్చొని మంగళవారం ఆందోళన చేపట్టాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలంలోని ఎనగల్ గ్రామంలో పెద్దమ్మ, ఎల్లమ్మ ఆలయాల సమీపంలో వాగులో వంతెనలు నిర్మించాలని పుప్పాల మోహన్ అనే యువకుడు వాగులో కూర్చొని ఆందోళన చేపట్టాడు. వ్యవసాయ పనుల కోసం రైతులు, ఈత, తాటి వనానికి వెళ్లేందుకు గౌడ కులస్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

ఎస్సారెస్పీకి పెరిగిన ఇన్‌ఫ్లో

జగిత్యాల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్(ఎస్సారెస్పీ)కు మంగళవారం ఇన్‌ఫ్లో పెరిగింది. 37 గేట్లు పైకి ఎత్తి 2,58,705 క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు ప్రస్తుతం 77.40 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వరద కాలువకు 8,000 క్యూసెక్కులు, కాకతీయ కాలువకు 4,000, సరస్వతీ కాలువకు 800 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 200 క్యూసెక్కుల నీరు విడుదల అవుతోంది.

శ్రీపాద ఎల్లంపల్లికి కొనసాగుతున్న వరద

పెద్దపల్లి: జిల్లాలో గల శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి వరద కొనసాగుతున్నది. మంగళవారం సాయంత్రం వరకు 4,51,833 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా, 38 గేట్ల ద్వారా గోదావరిలోకి 4,89,996 క్యూసెక్కుల నీటిని వదిలి పెడుతున్నారు. ఎస్సారెస్పీ నుంచి 2,32,128 క్యూసెక్కులు వస్తుండగా, కడెం నుంచి 14,964 క్యూసెక్కులు, పరివాహక ప్రాంతం నుంచి 2,04,741 క్యూసెక్కుల నీళ్లు వస్తున్నాయి. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 19.064 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. ఎస్సారెస్పీ, కడెం ప్రాజెక్టుల నుంచి పెద్దఎత్తున వరద నీరు వస్తున్నదని, ఈ నేపథ్యంలో 5 నుంచి 6 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలిపెడుతున్నామని, పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రామగుండం సర్కిల్ 7 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి రవీంద్రాచారి కోరారు.

మిడ్ మానేరుకు..

బోయినపల్లి: శ్రీ రాజరాజేశ్వర జలాశయానికి (మిడ్ మానేరు) ప్రాజెక్టుకు మంగళవారం 15161 ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఎస్సారెస్పీ నుంచి వరద కాలువ ద్వారా 7450, మానేరు, ములవాగు ద్వారా 7741 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగు తోంది. దిగువకు రెండు గేట్ల ద్వారా 8000 క్యూసెక్కులు, ప్యాకేజీ 10లోని అన్నపూర్ణ రిజర్వాయర్‌కు, ప్యాకేజీ 9లోని మల్కపేట రిజర్వాయర్‌కు 561 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318 మీటర్లకు ప్రస్తుతం 317.9 ఉండగా, సామర్థ్యం 27.55 టీఎంసీలకు 27.299 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది.


అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి కొనసాగుతున్న ఎత్తిపోతలు

ఇల్లంతకుంట: మండలంలోని అనంతగిరి గ్రామసమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి రెండుపంపుల ద్వారా నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 3.07టీఎంసీల నీరు ఉంది. మధ్యమానేరు ద్వారా వస్తున్న 6400క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తుండగా, ఎగువన ఉన్న రంగనాయకసాగర్‌కు 3300క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ఎల్ఎండీకి పెరిగిన వరద

తిమ్మాపూర్: వర్షాలతో ఎగువ నుంచి కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయంలోకి వస్తున్న వరద పెరిగింది. సోమవారం వరకు కేవలం ఎల్ఎండీ స్పిల్ వే రెండు గేట్లు ఎత్తి 4వేల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేసిన అధికారులు, ఇన్‌ఫ్లో పెరగడంతో మంగళవారం తెల్లవారు జామున 3 గంటలకు మరో 4 గేట్లు ఎత్తారు. మొత్తం 6 గేట్ల ద్వారా 14వేల క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. మోయతుమ్మెదవాగు నుంచి 10,509 క్యూసెక్కులు, మిడ్ మానేరు నుంచి 7 వేల క్యూసెక్కులు, ఎగువ కాకతీయ నుంచి 800 క్యూసెక్కులు మొత్తం 18,309 క్యూసెక్కుల నీరు ఎల్ఎండీలోకి వస్తోంది. పూర్తి స్థాయి నీటిమట్టం 24.034 టీఎంసీలు కాగా 23.602 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది.

చరిత్ర మరువని రోజు సెప్టెంబరు 17



తెలంగాణ చరిత్ర మరువని రోజు 1948 సెప్టెంబరు 17. అది నిజాం నిరంకుశత్వం తలవంచిన రోజు. రజాకార్ల ఆగడాలు అంతమైన రోజు. నాటి రెండు కోట్ల మంది తెలంగాణ ప్రజల హృదయాల్లో మువ్వన్నెల జెండా రెపరెపలాడిన పర్వదినం. ఈ నేలపై త్రివర్ణపతాకం ఎగిరిన రోజు. నిజాం రాచరిక పాలన ముగిసి, హైదరాబాద్ రాజ్యం భారత ప్రభుత్వంలో కలిసిన ఆ రోజు వెనుక అనేక ఘటనలు ఉన్నాయి. అందులో కొన్ని అంశాలు, ప్రముఖుల అభిప్రాయాలతో 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

- హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి)

భయంతో ఆస్తులమ్మారు



పోలీసు యాక్షన్‌కు వారం ముందు 'బక్రీదుకు గొర్రెలను కాదు, హిందువుల తలలు నరుకుతాం. వాళ్ల రక్తంతో హోలి ఆడతాం' అని రజాకార్ నాయకుడు ఖాసీం రజ్వీ ప్రకటించినట్లుగా నగరమంతా వదంతులు వ్యాపించాయి. దాంతో హిందువులంతా భయంతో ఆస్తిపాస్తులు అమ్ముకొని బతికినన్నాళ్లు అయినా ఆనందంగా జీవించాలని విందులు చేసుకున్నారు. అదే సమయంలో భారత సైన్యం ప్రవేశించడంతో నిజాం లొంగిపోయాడని తెలిసి ఊపిరి పీల్చుకున్నారు. యుద్ధ ట్యాంకులు, వాహనాలకు పూలమాలలు వేసి, భారత జవానులకు లడ్డూలు తినిపిస్తూ సంబురాలు చేసుకున్నారు. ముస్లింలంతా రజాకార్లు కాదు. ఆ సమయంలో రజాకార్ల దాడినుంచి ఎంతోమంది హిందువులను ముస్లింలు కాపాడారు. ఈ విషయాలన్నీ ప్రత్యక్ష సాక్షి మా అక్కచెప్పగా నాకు తెలిశాయి.

- పరవస్తు లోకేశ్వర్, నగర చరిత్ర పరిశోధకుడు

ఈ ఘట్టానికి ప్రతినాయకుడు ఖాసీం రజ్వీ

తెలంగాణ చరిత్రలోనే మరచిపోలేని సెప్టెంబరు 17 ఘట్టంలో ప్రతినాయకుడు ఖాసీం రజ్వీ. 'మజ్లిస్ ఎ ఇత్తేహాద్ ఉల్ ముస్లిమీన్' నాయకుడు. ఆయన స్వస్థలం మరఠ్వాడాలోని ఉస్మానాబాద్ జిల్లా లాతూర్. అలీగఢ్‌లో న్యాయశాస్త్రం అభ్యసించిన అనంతరం హైదరాబాద్‌లో కొంతకాలం వకీలు మహమ్మద్ అలీ ఫాజిల్ దగ్గర సహాయకుడిగా పనిచేశాడు. తర్వాత సొంతూరుకు వెళ్లిన అతను మజ్లిస్ స్థానిక నాయకుడిగా ప్రత్యేక గుర్తింపు పొందాడు. యావదాస్తిని సంఘానికి రాసిచ్చి నాయకుల మనసులో ప్రత్యేక స్థానం సంపాదించాడు. కొద్దిరోజులకే సంస్థ పగ్గాలు చేపట్టాడు. సమయస్ఫూర్తి, వాగ్ధాటితో సామాన్యులను ఆకట్టుకున్న రజ్వీ నిజాం ప్రభుత్వాన్ని శాసించే స్థాయికి ఎదిగాడు. రజాకార్ ఉద్యమానికి నాయకత్వం వహించాడు. హింసాత్మక ఘటనలకు కారకుడయ్యాడు. పోలీసు చర్య అనంతరం రజ్వీని భారత సైన్యం అరెస్టుచేసి తిరుమలగిరి సైనిక కారాగారంలో నిర్బంధించింది. 1957, సెప్టెంబరు11న విడుదలయ్యాడు. అదే నెల18న నగరం నుంచి ముంబైకు, అక్కడి నుంచి పాకిస్థాన్‌కు వెళ్లిపోయాడు. కరాచీలో ఒక అనామకుడిగా జీవనం సాగిస్తూ న్యాయవాదిగా ప్రాక్టీసు మొదలుపెట్టాడు. ఒకనాడు ఈ నేలను శాసించాలనుకున్న ఇత్తేహాదుల్ సారథి 1970, జనవరి15న ఓ సాధారణ వ్యక్తిగా కన్నుమూశాడు.

నిజాం ప్రధానిమీదా రజాకార్ల దాడి

నిజాం నిరంకుశ పాలనలో సామాన్యుల మానప్రాణాలను హరించిన రజాకార్లు నిజాం ప్రధాని మీదా దాడి చేయడం కొంత మందికే తెలుసు. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లిలోని ఓ ఆస్పత్రి ఆవరణలో తలెత్తిన ఘర్షణలో తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించాలన్న కాంక్షతో కొంతమంది రజాకార్లు ఆనాటి ప్రధాని అధికారిక నివాసం షా మంజిల్(ప్రస్తుతం రాజ్‌భవన్)ను ముట్టడించారు. లోపల గృహోపకరణాలకు నిప్పుపెట్టారు. అంతటితో ఆగక ప్రధానమంత్రిపై సైతం దాడికి పాల్పడ్డారని మందుముల నరసింహారావు జ్ఞాపకాల్లో ప్రస్తావించారు.

దక్కన్ రేడియోలో స్వాతంత్ర్య ప్రకటన

భారత ఆర్మీ 1948, సెప్టెంబరు18న నగరానికి చేరింది. అంతకు ఒకరోజు ముందు రోజు సెప్టెంబర్17న ఖాసీం రజ్వీ హైదరాబాద్‌లో నరమేధానికి వ్యూహం పన్నాడు. ఈ విషయం తెలిసి ఉస్మానాబాద్ కలెక్టర్ మొహమ్మద్ హైదర్ ఆనాటి నిజాం పోలీసు ఉన్నతాధికారి నవాజ్ దీన్‌యార్‌జంగ్ దగ్గరకు పరుగుతీశాడు. ఇరువురు ఫోన్‌ద్వారా రజ్వీకి నచ్చజెప్పి కల్లోలాన్ని ఆపించారు. ఈ విషయాన్ని మొహమ్మద్ హైదర్ జ్ఞాపకాల్లో రాశారు.

అంతకు ముందురోజే సైన్యాధ్యక్షుడు ఎల్.ఇద్రూస్ నిజాంను కలిసి సైన్యాన్ని ప్రతిఘటించడం వల్ల మరింత ప్రాణ నష్టం మినహా మరేమీ లేదని విన్నవించాడు. దీంతో సెప్టెంబరు17న మొదట ఖాసీం రజ్వీ ఖైరతాబాద్‌లోని దక్కన్ రేడియో ద్వారా తన ఓటమిని అంగీకరించాడు. ఆ తర్వాత కేఎంమున్షీతో కలిసి దక్కన్ రేడియోకు చేరుకున్న నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్.. భారత సైన్యాన్ని స్వాగతిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో కొన్ని వందల ఏళ్ల రాచరిక పాలన నుంచి ఈ నేలకు స్వాతంత్ర్యం సిద్ధించింది. ప్రజలంతా ఆనందోత్సాహాలతో సంబురాలు చేసుకున్నారు. నగర వీధుల్లో జాతీయ జెండా ఎగరేశారు.

అమరుల త్యాగాలను పాఠ్యపుస్తకాల్లో ముద్రించాలి

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

తిమ్మాపూర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నాటి అమరుల త్యాగాలను పాఠ్య పుస్తకాల్లో ముద్రించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా చాడ వెంకటరెడ్డి మండలంలోని పోలంపల్లిలో ఏర్పాటు చేసిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీరుడు అనభేరి ప్రభాకర్‌రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం సీపీఐ జెండాను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనభేరి ప్రభాకర్‌రావు సొంత గ్రామమైన పోలంపల్లిలో సీపీఐ పక్షాన



పోలంపల్లిలో సీపీఐ ర్యాలీలో చాడ వెంకట్‌రెడ్డి

భారీ ర్యాలీ నిర్వహించి ఆయనకు నివాళులర్పించడం గర్వంగా ఉందని అన్నారు. 10 లక్షల ఎకరాల ప్రభుత్వ భూములను పేదలకు పంచిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీకి ఉందని తెలిపారు. అనభేరి ప్రభాకర్‌రావు విగ్రహాన్ని హైదారాబాద్‌లోని ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేయాలని చాడ వెంకటరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, మండల కార్యదర్శి బోయిని తిరుపతి, నాయకులు సూరం మల్లేశం, పిట్టల శ్రీనివాస్, ఎల్లాస్వామి, బండారి రమేష్, తిరుపతిరెడ్డి నాయకులు పాల్గొన్నారు.

ప్రజాపాలనలో సబ్బండ వర్గాలకు సమన్యాయం

మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆది శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన ప్రభుత్వంలో సబ్బండ వర్గాలకు సమన్యాయం జరుతుందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. మంగళ వారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మాదిగల ఐక్యవేదిక ఆధ్వర్యంలో అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు కత్తెర దేవదాస్ అధ్యక్షతన మాదిగల ఆత్మీ సమ్మేళన సభ జరిగింది. ముఖ్య అతిథిగా మంత్రి లక్ష్మణ్ కుమార్‌తో పాటు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ఆత్మీయ సమ్మేళనంలో మంత్రిని మాదిగ నాయకులు ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. రాహుల్‌గాంధీ, ఖార్గే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ మాదిగల పక్షాన మంత్రిగా తనకు అవకాశం ఇచ్చారన్నారు. నేరెళ్ల సంఘటనపై ఆరోజు కాంగ్రెస్ నాయకులం కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలో బాధితులను పరామర్శించామన్నారు. నాటి స్పీకర్ మీరా కుమారి స్వయంగా వచ్చి నేరెళ్ల బాధితులను పరామర్శించినప్పుడు బాధితుల ఆవేదన కన్నీల్లు పెట్టించిందన్నారు. కేటీఆర్, సంతోష్‌రావు తదితరులు విచక్షణా రహితంగా నేరెళ్ల ఘటనలో దళితులపై దాడులు చేయించారని ఆరోపించారు.

అసెంబ్లీలో ముఖ్యమైన ఘటం వర్గీకరణ చట్టంను అమలు చేస్తుంటే చట్టసభకు రాకుండా ఫాంహౌస్‌కు పరిమితం అయ్యాడని ఆరోపించారు. దళితులకు చెందాల్సిన భూములు వారికిచ్చే బాధ్యతను తీసుకుంటామన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీని వాస్ మాట్లాడుతూ చంద్రంపేట చౌరస్తాలో మాజీ ఎమ్మెల్యే కర్రోల్ల నర్సయ్య విగ్రహం ఏర్పాటు, అదేవిధంగా జిల్లా కేంద్రంలో అంబేద్కర్ ఫంక్షన్‌హాల్‌ను నిర్మాణం చేయాలన్న నాయకుల ప్రతి పాదనను పరిశీలిస్తామన్నారు. రగుడు వద్ద అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండుగులపై చర్యలు తీసుకోవాలని దళిత నాయకుడు రాగుల రాములు విజ్ఞప్తిని ఎస్పీ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయం జిల్లా చైర్మన్ నాగుల సత్యనారాయణ, మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ వెల్మల స్వరూపతిరుపతిరెడ్డి, సెస్ డైరెక్టర్ కొట్టెపల్లి సుధాకర్, మాజీవిప్ ఆరెపెల్లి మోహన్, కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ఉపాధ్యక్షుడు బొప్ప దేవయ్య, టీపీసీసీ కోఆర్డినేటర్ సంగీతం శ్రీనివాస్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, పీసీసీ మాజీ కార్యదర్శి గడ్డం నర్సయ్య పాల్గొన్నారు.

ఆర్టీఐ చట్టాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలి

● రాష్ట్ర సమాచార ప్రధాన కమిషనర్ డాక్టర్ జి చంద్రశేఖర్‌రెడ్డి



మాట్లాడుతున్న ప్రధాన కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి

సిరిసిల్ల సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సమాచార హక్కు చట్టం-2005ను అధికారులు కట్టుదిట్టంగా అమలుచేయాలని రాష్ట్ర సమాచార ప్రధాన కమిషనర్ డాక్టర్ జి చంద్ర శేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజా సమాచార అధికారులకు ఆర్టీఐ చట్టం అమలులో ఉన్న సందేహాలను అడిగి నివృత్తి చేశారు. సమాచార హక్కు చట్టం సంబంధించి జిల్లాలో పెండింగ్ ఉన్న 134 కేసులను కమిషన్ సభ్యులు పరిష్కరించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ప్రజా సమాచార అధికారి, మొదటి అప్పిలేట్ అథారిటీ, రెండో అప్పిలేట్ అథారటీ పేర్లు, ఫోన్ నంబర్లతో కూడిన బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. అధికారులు పారదర్శకంగా విధులు నిర్వహించాలని, ప్రజలు కోరిన సమాచారం నిర్ణీత సమయంలో అందించాలన్నారు.

జవాబుదారీతనం పెరిగింది

సమాచార హక్కు చట్టం కారణంగా ప్రభుత్వ పాలనలో పారదర్శకత జవాబుదారీతనం పెరిగిందని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. మండల స్థాయిలో సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ప్రతి కార్యాలయానికి వచ్చే ఆర్టీఐ దరఖాస్తుకు సకాలంలో సమాధానం అందించేలా అధికారులకు ఆదేశాలు అందించామన్నారు. సమాచార హక్కు చట్టం కమిషనర్లు దేశాల భూపాల్, పీవీ శ్రీనివాసరావు, అయోధ్యరెడ్డి, మొహసిన పర్వీన్‌లు మాట్లాడుతూ ఆర్టీఐ చట్టం ప్రజల్లో తీసుకుని వెళ్లేందుకు వారధులుగా ప్రభుత్వ అధికారులు సిబ్బంది పని చేయాలన్నారు. కార్యక్రమంలో సిరిసిల్ల, వేములవాడ అదనపు ఎస్పీలు చంద్రయ్య, శేషాద్రినిరెడ్డి, ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాబాయి, జిల్లాలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల ఫస్ట్ అప్పిలేట్ అధికారులు, పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్లు, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉమ్మడి జిల్లాస్థాయి అండర్-17 బాక్సింగ్, ఉషు పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో బుధ, గురువారాల్లో ఉమ్మడి జిల్లా స్థాయి అండర్-17 బాలబాలికల బాక్సింగ్, ఉషు పోటీలను నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో ఉదయం 8 గంటల నుంచి ఈ పోటీలను నిర్వహించనున్నామని జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య కార్యదర్శి వేణుగోపాల్, బాక్సింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సంపత్ కుమార్ తెలిపారు. బుధవారం అండర్- 17 బాల బాలికల విభాగాల్లో బాక్సింగ్ పోటీలు, గురువారం ఉష పోటీలను నిర్వహించనున్నామని తెలిపారు.

ఆసక్తి గల క్రీడాకారులు హెచ్‌డీఎఫ్ ఎలిజిబిలిటీ ఫాం, ఆధార్ కార్డు జిరాక్స్, బోనఫైడ్ సర్టిఫికెట్‌తో ఉదయం 9 గంటలకు రిపోర్టు చేయాలని పేర్కొన్నారు.

రామగుండం ఎన్టీపీసీకి రాజ్‌భాష జాతీయ అవార్డు



అవార్డు అందుకుంటున్న ఎన్టీపీసీ ఏజీఎం విజయ్‌కుమార్ సిక్దర్

జ్యోతినగర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పెద్దపల్లి జిల్లా రామగుండం ఎన్టీపీసీకి రాజ్‌భాష జాతీయ అవార్డు లభించింది. అధికారిక భాషా విధానం అమలులో విశేష కృషి చేసినందుకుగాను 2024-25 సంవత్సరానికి కేంద్ర హోం మంత్రిత్వ శాఖ రామగుండం ఎన్టీపీసీ రాజ్‌భాష కమిటీని జాతీయ అవార్డుకు ఎంపిక చేసింది. ఈ మేరకు మంగళవారం గుజరాత్ రాజధాని గాంధీనగర్‌లో జరిగిన కార్యక్రమంలో ఎన్టీపీసీ ఏజీఎం(హెచ్ఆర్) విజయ్ కుమార్ సిక్దర్ అవార్డును అందుకున్నారు. ఎన్టీపీసీ ఈడీ చందన్‌కుమార్ సామంత నాయకత్వంలో హిందీ బాషను ప్రోత్సహించడం, ప్రచారం చేయడంలో రాజ్‌భాష కమిటీ అంకితభావంతో పని చేసిందని యాజమాన్యం ఒక ప్రకటనలో పేర్కొంది.

ధర్మపురిలో ఘనంగా ఉట్టి వేడుకలు

ధర్మపురి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి):ధర్మపురి క్షేత్రంలోని ఇసుక స్తంభం వద్ద మంగళవారం ఉట్టి వేడుకలు నిర్వహించారు. స్వామి వారలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం శెలారితో ఇసుక స్తంభం వరకు వెళ్లి ఉట్టి కొట్టి వేడుకలు నిర్వ హించారు. కార్య క్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మం డలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, ధర్మ కర్తలు ఏదులాపురం మహేందర్, రాపర్తి సాయి కిరణ్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, రాజగోపాల్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్ పాల్గొన్నారు. మంగళ వారం భక్తుల రద్దీ పెరిగింది. దీంతో లక్ష్మీ నరసింహస్వామి అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.



ఉట్టి వేడుకల్లో పాల్గొన్న అర్చకులు, సిబ్బంది

రేపటి నుంచి ఉమ్మడి జిల్లా స్థాయి జూనియర్ కళాశాలల క్రీడలు



కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్ జిల్లా జూనియర్ కళాశాలల అండర్-19 ఎస్‌జీఎఫ్ క్రీడల షెడ్యూల్‌ను మంగళవారం డీఐఈవో వి.గంగాధర్, పోటీల నిర్వహణ కార్యదర్శి జి.మధుజాన్సన్ ప్రకటించారు. ఈ పోటీలను ఉమ్మడి జిల్లాస్థాయిలో గురువారం నుంచి నవంబరు 7 వరకు నిర్వహించనున్నారు. మొత్తం 37 క్రీడాంశాలలో నిర్వహించే ఈ పోటీలలో పాల్గొనే క్రీడాకారులు అర్హత ఫారంతో పాటు ఆధార్ కార్డు జిరాక్స్, బోనఫైడ్ సర్టిఫికెట్, పదో తరగతి మెమో జిరాక్స్ కాపీలను జపరచాల్సి ఉంటుంది. ఈ పత్రాలపై కళాశాలల ప్రిన్సిపాల్ సంతకంతో హాజరుకావాలి. మంగళవారం నిర్వహించిన సమావేశంలో జిల్లాలోని వివిధ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్‌లు, సత్యవర్ధన్ రావు, ఆంజనేయరావు, రాజేశ్వరరావు, శశిధర్‌శర్మ, నిర్మల, వెంకటరమణాచారి, బల్వీందర్‌సింగ్ పాల్గొన్నారు.

క్రీడల షెడ్యూల్

జగిత్యాలలోని పొన్నాల గార్డెన్స్‌లో గురువారం బాలబాలికల విభాగంలో థై క్వాండో, కరాటే, బాక్సింగ్, థైక్వాండో మార్షల్ ఆర్ట్స్, 19న కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈటెక్నో ఉన్నత పాఠశాలలో బాల బాలికలకు చెస్, యోగాసన పోటీలు నిర్వహించనున్నారు. 20న కరీంనగర్ లోని అంబేద్కర్ స్టేడియంలో బాలురకు ఫుట్‌బాల్, అనంతరం అక్టోబరు 6న కొత్తపల్లి అల్ఫోర్స్ ఈటెక్నో పాఠశాలలో బాల బాలికలకు ఉషు, జూడో, 7న అల్ఫోర్స్ ఈటెక్నో పాఠశాలలో బాలురకు కబడ్డీ పోటీలు, 8న టీజీడబ్ల్యూఆర్ఎస్ జూనియర్ కళాశాల చింతకుంటలో బాలికలకు కబడ్డీ, 9న తిమ్మాపూర్‌లోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో బాలురకు వాలీబాల్, 10న టీజీడబ్ల్యూఆర్ఎస్ చింతకుంట జూనియర్ కళాశాలలో బాలికలకు వాలీబాల్, 13న కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో బాలబాలికలకు అథ్లెటిక్స్, 17న జగిత్యాలలోని మినీ స్టేడియంలో బాలబాలికలకు క్రికెట్, 18న కొత్తపల్లి అల్ఫోర్స్ ఈటెక్నోలో బాలబాలికలకు నెట్‌బాల్, టేబుల్ టెన్నీస్, 23న గోదావరిఖని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో బాల బాలికలకు వెయిట్ లిఫ్టింగ్, స్కేటింగ్ పోటీలు ఉంటాయి.

24న కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో బాలురకు ఖో-ఖో, 25న అంబేద్కర్ స్టేడియంలో బాలికలకు ఖో-ఖో, 26న కొత్తపల్లి తేజస్ జూనియర్ కళాశాలలో బాల బాలికలకు బాస్కెట్ బాల్, 28న జగిత్యాల మినీ స్టేడియంలో బాలబాలికలకు ఫెన్సింగ్, సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్, 29న కొత్తపల్లి అల్ఫోర్స్ ఈటెక్నోలో బాలబాలికలకు స్విమ్మింగ్, 31న కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో బాలబాలికలకు హాకీ, నవంబరు 4న కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీలో బాలబాలికలకు సైక్లింగ్, 6న కొత్తపల్లి తేజస్ జూనియర్ కళాశాలలో బాలబాలికలకు ఆర్చరీ, 7న జగిత్యాల మినీ స్టేడియంలో బాలబాలికలకు రగ్బీ పోటీలు, జగిత్యాల క్లబ్‌లో బాలబాలికలకు షటిల్ బ్యాడ్మింటన్, షూటింగ్, జగిత్యాల మినీ స్టేడియంలో బాలబాలికలకు ఫుట్‌బాల్ పోటీలను నిర్వహిస్తారు.



పరవళ్లు తొక్కుతున్న ఎగువ మానేరు

గంభీరావుపేట మండలం నర్మాల మానేరు ప్రాజెక్టు మళ్లీ పరవళ్లు తొక్కుతోంది. రెండు రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలకు కూడవెల్లి, పల్వంచ వాగులు పొంగుతున్నాయి. వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో మానేరు జలాశయానికి వరద నీరు భారీగా వస్తోంది. ఎగువ మానేరు మత్తడి మీదుగా పరవళ్లు తొక్కుతోంది. దీంతో మానేరు వాగు బ్రిడ్జిపై నుంచి ప్రవహిస్తుండటంతో సిద్దిపేట-కామారెడ్డి మార్గంలో వాహనాల రాకపోకలు నిలిచి పోయాయి.

- గంభీరావుపేట, ఆంధ్రజ్యోతి

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక

మల్యాల, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఇటీవల తాటిపల్లి బాలికల గురుకుల పాఠశాలలో జరిగిన మండల స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలలో తాటిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటి జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక అయినట్లు హెచ్‌ఎం అనుపమ తెలిపారు. అండర్-14, అండర్-17 అథ్లెటిక్స్ పోటీలకు సుదర్శన్, శివకుమార్, నవనీత్, అభినయ్, దీక్షిత్, రాజేందర్, దుర్గాప్రసాద్, హర్షవర్ధన్, సంగీత్, రెహాన్, అశిష్, అభిరామ్, హుస్సేన్, సాయిచరన్, వెంకటాచారితో పాటు పీడీ విశ్వప్రసాద్‌ను ఎంపిక కాగా పాఠశాల అధ్యాపకులు అభినందించారు.

భయభ్రాంతులకు గురిచేసిన వారిపై కేసులు

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) :జగిత్యాల కలెక్టరేట్ కార్యాలయంలోని చొచ్చుకు వచ్చి అధికారులను బెదిరింపులకు గురి చేయడంతో పాటు ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకుంటామని భయభ్రాంతులకు గురిచేసిన పలువురు వ్యక్తులపై పట్టణ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి నిర్వహించగా మెట్‌పెల్లి మండలం జగ్గాసాగార్ గ్రామానికి చెందిన పల్లికొండ ప్రవీణ్‌తో పాటు మరికొంత మంది వ్యక్తులు చెరువులపై హక్కులు కల్పించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ గేటు లోపలికి అక్రమంగా ప్రవేశించారు. అడ్డుకున్న పోలీస్ సిబ్బంది విధులకు ఆటంకం కలిగించారు. దీంతో టౌన్ కానిస్టేబుల్ విజయేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై కుమారస్వామి పలువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

సీసీ రోడ్డు నిర్మించాలి

రాయికల్, సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలోని 3వ వార్డు ఇందిరానగర్‌లో సీసీ రోడ్డు మంజూరు చేయాలని మున్సిపల్ కమిషనర్ మనోహర్ గౌడ్‌కు మంగళవారం కాలనీవాసులు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో బన్న సంజీవ్, రాజయ్య, శైలజ, అనిల్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర కోశాధికారికి సన్మానం

జగిత్యాల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర కోశాధికారిగా బాధ్యతలు చేపట్టిన దేవకి వాసుదేవరావును మంగళవారం జగిత్యాల జిల్లా వాసవి ట్రస్ట్ వ్యవస్థాపకుడు పబ్బ శ్రీనివాస్ సన్మానించారు. హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో వాసుదేవరావును సత్కరించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

గొల్లపల్లి, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి) : గొల్లపల్లి మండలం రాఘవపట్నం గ్రామంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను స్థానిక కాంగ్రెస్ నాయకులు బాధితులకు మంగళవారం అందజేశారు. గ్రామానికి చెందిన తీథి మంది లబ్ధిదారులకు రూ. 4,36,000 విలువైన చెక్కులను పంపిణీ చేసినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఏఎమ్‌సీ డైరెక్టర్ వూట్కూరి సురేందర్ రెడ్డి, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ కొలకాని జలంధర్, నాయకులు ప్రవీణ్‌గౌడ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

విద్యా రంగానికి అధిక ప్రాధాన్యం



మాట్లాడుతున్న జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల అగ్రికల్చర్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి అధిక ప్రాధాన్యతను ఇస్తూ అత్యధిక నిధుల మంజూరుకు కృషి చేస్తోందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. జగిత్యాల పట్టణంలోని ఖిలాగడ్డ మైనార్టీ గురుకుల బాలుర పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులతో ముచ్చటిస్తూ వారి సమస్యలు, భోజన మెనూను అడిగి తెలుసుకున్నారు. మెనూ పక్కాగా అమలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పేరెంట్, టీచర్ సమావేశం నిర్వహిస్తే హాజరవుతానన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మైనార్టీ బాలుర పాఠశాలలో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని, పాఠశాలలో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కాస్మోటిక్ డైట్ చార్జీలను 40శాతంకు పెంచిందని ఆయన గుర్తు చేశారు. అలాగే చల్‌గల్‌లో రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్స్ మంజూరు చేయడం జరిగిందని అన్నారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉందని ఆయన ప్రిన్సిపాల్ రవికి సూచించారు. ఆయన వెంట మున్సిపల్ మాజీ చైర్మన్‌లు గిరి నాగభూషణం, అడువాల జ్యోతిలక్ష్మణ్, మైనార్టీ నాయకులు ముజాహిద్, మాజీ ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కమిటీ మాజీ సభ్యులు దుమాల రాజ్‌కుమార్, ఇంచార్జి ప్రిన్సిపాల్ రవి, నాయకులు ముఖీమ్, నాజీమ్‌తో పాటు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : అందరూ పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో మణెమ్మ అన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పోషణ్ భీ.పడాయి భీ కార్యక్రమంపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఆమె అన్నారు. పోషణ్ భీ..పడాయి భీలో భాగంగా ఈనెల 15 నుంచి 17 వరకు నిర్వహించే కార్యక్రమలపై మంగళవారం మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో మెట్‌పల్లి, ఇబ్రహీంపట్న మండలాలోని అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీవో మణెమ్మ మాట్లాడుతూ ప్రారంభ బాల్య ప్రేరణ కోసం గృహ సందర్శనలు, సంరక్షణలకు శిక్షణ, బాల్యవిద్య ప్రాముఖ్యత, పౌష్టికాహార లోపాన్ని నివారించడం, రక్తహీనత, తల్లిపాల ప్రాముఖ్యత, నవజాతి శిశువు సంరక్షణ, ఐదు సంవత్సరాల లోపు చిన్నారుల బరువులు వంటి కార్యక్రమాలను నిర్వహించాలని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్లు షమీంసుల్తానా, ప్రతిభ, డీపీఏ ప్రశాంత్, డీఈవో, మానస, తదితరులు పాల్గొన్నారు.

●కొడిమ్యాల: పిల్లలను నైపుణ్య వంతులుగా తయారు చేయాలని అంగన్‌వాడీ టీచర్లను సీడీపీవో వీరలక్ష్మీ కోరారు. మంగళవారం మండలంలోని పూడూర్ రైతు వేదికలో కొడిమ్యాల, గొల్లపెల్లి మండలాల అంగన్‌వాడీ టీచర్లకు పోషన్ భీ పడాయి శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీడీపీవో పిల్లల పోషణ ఐదు రకాల పద్ధతులను గురించి వివరించారు. క్రమబద్ధీకరించడం, ఆలోచించడం, సృజనాత్మకత, సంగీతం, కళలు, పిల్లలు ఎలా పెరుగుతారు, పరుగెత్తడం, కండరాల అభివృద్ధి, మాట్లాడటం, చదవటం, వినటం, రాయటం అనే అంశాలపై మూడు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ శిక్షన కార్యక్రంలో ఏసీడీపీవో అరవింద, సూపర్‌వైజర్లు ఉమ, సుధారాణి, జ్యోతి, జానకి అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఆయిల్‌పాం సాగుతో అధిక లాభాలు



ఆయిల్‌పాం తోటను పరిశీలిస్తున్న ఉద్యానవన అధికారులు

కథలాపూర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పాం సాగుతో అధిక లాభాలు ఉంటాయని ఉద్యానవన శాఖ అధికారులు అన్నారు. మండలంలోని భూషణరావుపేటలో మంగళవారం ఉద్యానవన శాఖ అధికారులు ఆయిల్‌పాం తోటలను పరిశీలించారు. ఉద్యాన విస్తీర్ణాధికారి అన్వేష్, లోహియా కంపనీ మేనేజర్ విజయ్‌భరత్ పంటలు సాగు చేసిన రైతులకు పలు సూచనలు చేశారు. 30-34 నెలల వయసున్న తోటల్లో పూత తీసి వేయవద్దని కొద్ది రోజుల్లో పరపరాగ సంపర్కం కోసం పురుగులను వదులుతామన్నారు. చెట్ల పాదులలో ఎలాంటి గడ్డి మందులు పిచికారి చేయవద్దని, మట్టలు కోయవద్దని సూచించారు. ప్రతీ మూడు మాసాలకోసారి సిఫార్సు చేసిన యూరియా 525 గ్రాములు, డీఏపీ 325 గ్రాములు, పొటాష్ 500 గ్రాములు వేయాలన్నారు. అదేవిధంగా ప్రతీ 6 మాసాలకోసారి మెగ్నీషియమ్ సల్ఫేట్ 250, బోరాన్ 100 గ్రాముల చొప్పున మొక్క మొదటి నుంచి 3 ఫీట్ల దూరంలో వేయాలన్నారు. కొత్తగా పంట సాగు చేసేందుకు ఆసక్తి ఉన్న రైతులకు 90 శాతం సబ్సిడీపై రు. 20లకే మొక్కలు అందిస్తామన్నారు. ఎకరానికి సంవత్సరానికి రు. 4200ల చొప్పున నిర్వాహణ ఖర్చులు అందజేస్తామని వివరించారు. ఈ సందర్భంగా రైతులు జనార్ధన్‌రెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, రాజరెడ్డి, ఫీల్డ్ ఆఫీసర్ శ్రావణ్ తదితరులు ఉన్నారు.

●బీర్‌పూర్: రైతులు సబ్సిడీలను సద్వినియోగం చేసుకొని పంటల సాగుద్వారా అధిక ఆదాయం పొందాలని ఉద్యాన వనశాఖ నియోజకవర్గం అధికారి కందుకూరి స్వాతి అన్నారు. మంగళవారం బీర్‌పూర్ మండలంలోని తుంగూర్ గ్రామంలో ఆయిల్‌పామ్ పంటలను పరిశీలించారు. అర్హులైన రైతులకు ఉద్యాన వన శాఖ ద్వారా సబ్సిడీ అందించడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో హార్టికల్చర్ ఎక్స్‌టెంక్షన్ ఆఫీసర్ వంశీకృష్ణ, మాజీ ఎంపీపీ మసర్తి రమేష్, రైతులు మిట్టపెల్లి రాములు, ఐతే గణపతి పాల్గొన్నారు.

ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం

మల్యాల, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): చొప్పదండి మండలం ఆర్నకొండ నుంచి మల్యాల మండల కేంద్రం వరకు డబుల్ రోడ్డుగా మార్చడానికి కేంద్రమంత్రి బండి సంజయ్ రూ.50కోట్ల నిధులు మంజూరి చేయించడం పట్ల మల్యాలలో మంగళవారం బీజేపీ నాయకులు ప్రధాని మోదీ చిత్రపటంకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో గాజుల మల్లేశం, రాచర్ల రమేశ్, సంగని రవి, జనగం రాములు, రమ, రాజుకుమార్, అంజన్న, గౌతం పాల్గొన్నారు.

కిక్‌బాక్సింగ్‌లో విద్యార్థుల ప్రతిభ

జగిత్యాల అగ్రికల్చర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్టేట్ లెవల్ అస్మిత కిక్ బాక్సింగ్ లీగ్ 2025-26లో మానస స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ విద్యార్థులు తమసత్తా చాటారని పాఠశాల ప్రిన్సిపాల్ రజిత శ్రీధర్‌రావు అన్నారు. సెప్టెంబర్ 14న వరంగల్‌లోని ఇండోర్ స్టేడియంలో, జీడబ్ల్యూఎంసీలో జరిగిన ఈ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు శాన్విక, సిరివర్షిణి, హారతి, శ్రీనిధి లు ప్రతిభ కనబర్చి మెడల్స్ సాధించారని ఆమె తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు డైరెక్టర్లు శ్రీధర్‌రావు, హరిచరణ్‌రావు, మౌనికరావు అభినందించారు.

కరపత్రం ఆవిష్కరణ

కోరుట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గణేష్ నవదుర్గ మండలి ఆధ్వర్యంలో పట్టణంలోని త్రిశక్తి దేవాలయంలో నిర్వహించే శరన్నవరాత్రి ఉత్సవాల కరపత్రం మండలి సభ్యులు మంగళవారం ఆవిష్కరించారు. శరన్నవ రాత్రోత్సవ ఆహ్వాన పత్రికలను పంపిణీ చేశారు.

అదనపు కలెక్టర్‌కు వినతి

కొడిమ్యాల, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఆర్‌టీఐ సక్రమంగా అమలయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం అదనపు కలెక్టర్ రాజాగౌడ్‌కు ఆర్‌టీఐ జిల్లా అధ్యక్షుడు, మండల బీజేపీ సీనియర్ నాయకుడు అక్కపెల్లి రవీందర్, బీజేపీ సీనియర్ నాయకుడు కిషన్‌గౌడ్ వినతిపత్రం అందించారు. ఇటీవల అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన రాజాగౌడ్‌కు అంజనేయస్వామి చిత్రపటాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఆరోగ్య మహిళే లక్ష్యం

(5వ పేజీ తరువాయి)

గురించి అవగాహన కల్పిస్తారు. రక్తదాన శిబిరాలు, నిశ్చయ్ మిత్ర వలంటర్లీ రిజిస్ట్రేషన్, అవయవ దాతల రిజిస్ట్రేషన్ వంటివి నిర్వహించనున్నారు. మహిళలకు యోగా మెళకువలు, బలవర్ధక ఆహారం తీసుకోవడం వల్ల జరిగే ప్రయోజనాలు వివరించనున్నారు. మహిళల ఆరోగ్యంతోనే వికసిత్ భారత్ సాధ్యమవుతుందని భారత ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్టు వైద్య ఆరోగ్య శాఖ వర్గాలు అంటున్నాయి.

పకడ్బందీగా నిర్వహిస్తాం..

-డాక్టర్ ప్రమోద్ కుమార్, డీఎంహెచ్‌వో



కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే స్వస్త్ నారి...సశక్త్ పరివార్ అభియాన్ బుధవారం నుంచి పక్కగా నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేశాం. జిల్లాలోని ప్రతి మహిళకు వైద్య సేవలు అందించేలా ఏర్పాట్లు చేశాం. జిల్లాలోని అన్ని ప్రాంతాల మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

మహిళల ఆరోగ్య సంరక్షణే లక్ష్యం

-డాక్టర్ నీలారపు శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్‌వో, జగిత్యాల



మహిళల ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా వైద్య శిబిరాలు చేపడుతున్నాం. మహిళలకు ఆరోగ్యంపై అవగాహనతో పాటు చైతన్యం కల్పించే విధంగా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది కృషి చేస్తోంది. జిల్లాలో 13 రోజుల పాటు నిర్వహించనున్న ప్రత్యేక వైద్య శిబిరాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలి.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రమోద్

జగిత్యాల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని జగిత్యాల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ తత్వాది ప్రమోద్ కుమార్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (అటానమస్)లో ఎన్ఎస్ఎస్, హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో 'టేస్ట్ ద గుడ్‌నెస్ ఫుడ్ ఫెస్టివల్' కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల పోషక విలువలు కలిగిన 40 రకాల ఆహార పదార్థాలను వండుకొని తీసుకువచ్చి ప్రదర్శించారు ఈ సందర్భంగా కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ తత్వాది ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం సెప్టెంబరు నెలను పోషణ మాసంగా ప్రకటించిందన్నారు. విద్యార్థులకు సమతుల ఆహారం యొక్క ప్రాముఖ్యతను వివరించడానికి ఈ కార్యక్రమాన్ని చేపట్టిన ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు, హెల్త్ క్లబ్ కో ఆర్డినేటర్‌లను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల చరిత్ర లెక్చరర్ మల్లికార్జున్, ఇంగ్లీష్ లెక్చరర్ జ్యోష్న, తెలుగు లెక్చరర్ శ్రీలత పాల్గొన్నారు.

విశ్వకర్మ జయంతిని విజయవంతం చేయాలి

బీర్‌పూర్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): విరాట్ విశ్వకర్మ జయంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు అన్నారు. మంగళవారం బీర్‌పూర్ మండలంలో డీజే సప్పుళ్ళ మధ్య బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సెప్టెంబరు 17న విరాట్ విశ్వకర్మ యజ్ఞం మహోత్సవం కార్యక్రమాన్ని బీర్‌పూర్ లక్ష్మీనరసింహ స్వామి కల్యాణ మండపంలో ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. బైక్ ర్యాలీలో మండలంలోని విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు పాల్గొన్నారు.

'బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారం రావాలి'

బీర్‌పూర్, సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి): బడుగు బలహీన వర్గాలకు రాజ్యాధికారం రావాలని డాక్టర్ విశారదన్ మహారాజ్ అన్నారు. మంగళవారం బీర్‌పూర్ మండలంలో డాక్టర్ విశారదన్ మహారాజ్ పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మావోయిస్టు అగ్రనేత ముప్పాల గణపతి అలియాస్ లక్ష్మణ్‌రావ్ ఇంటిస్థలాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రోళ్ళవాగు ప్రాజెక్టును సందర్శించారు. ఆయన వెంట మండల బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రియాద్‌లో ఘనంగా ఇంజనీర్స్ డే



వేడుకల్లో పాల్గొన్న సాటా సభ్యులు

రాయికల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సౌదీ అరేబియాలోని రియాద్‌లో సౌదీ అరేబియా తెలుగు అసోసియేషన్(సాటా) ఆధ్వర్యంలో ఇంజనీర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రముఖ ఇంజనీర్, స్వాతంత్ర్య సమరయోధుడు, భారతరత్న పురస్కార గ్రహీత మోక్షగుండం విశ్వేశ్వరయ్య చేసిన సేవలను కొనియాడారు. అనంతరం కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో సాటా టీబీఎన్ అధ్యక్షుడు యోగేశ్వర రావు వీరవల్లి, సాటా ఫౌండర్ మల్లేశన్, సాటా రియాద్ కోర్ టీమ్ సభ్యులు శర్వాణి విద్యాధరణి, కోకిల ఒత్లూరి, ప్రీతి చౌహాన్, మహ్మద్ నూరుద్దీన్, సింగూ నరేష్ కుమార్, అహ్మద్ అబ్దుల్ కరీమ్, మహ్మద్ అబ్దుల్ ఘఫ్ఫార్, మిధున నరేష్, ముదిగొండ శంకర్, మురళి కృష్ణ బూసి, లోకేష్ తాళ్ల తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీర్లకు సన్మానం

మెట్‌పల్లిటౌన్, సెప్టెంబర్ 16(ఆంధ్రజ్యోతి):మెట్‌పల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఇంజనీర్స్ డే పురష్కరించుకొని ఇంజనీర్లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వెల్ముల శ్రీనివాస్‌రావు, క్యాషియర్ వేములవాడ చంద్రశేఖర్, కొండపల్లి రేణుక పాల్గొన్నారు.

యథావిధిగా కళాశాలల తరగతుల నిర్వహణ

జగిత్యాల అగ్రికల్చర్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో యథావిధిగా కళాశాలలను నిర్వహించామని శాతవాహన యూనివర్సిటీ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్య అసోసియేషన్(సుప్మా) బాధ్యులు తెలిపారు. పెండింగ్ నిధులను రెండు విడతల్లో విడుదల చేస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు ఇచ్చిన హామీ మేరకు మంగళవారం కళాశాలలు ప్రారంభించి, తరగతులు నిర్వహించినట్లు వారు తెలిపారు. యాజమాన్యాల పరిస్థితిని, విద్యార్థుల ఇబ్బందులను పరిగణలోకి తీసుకొని నిధుల విడుదలకు సహకరించిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్ర స్థాయి టీఎల్‌ఎం మేళాకు ఎంపిక

వెల్గటూర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిషన్‌రావుపేట ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన మునీంద్ర తయారు చేసిన టీఎల్‌ఎం రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు నర్మల గంగన్న తెలిపారు. మునీంద్ర తయారు చేసి టీఎల్‌ఎం పరిశీలించిన కలెక్టర్ సత్య ప్రసాద్, డీఈవో రాము అభినందించారు.

ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు లేకుండా చర్యలు

పెగడపల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులు కలుగకుండా ముందస్తుగా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని పెగడపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం పెగడపల్లి మార్కెట్ కమిటీ సర్వసభ్య సమావేశం చైర్మన్ రాములు గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో వైస్ చైర్మన్ సురకంటి సత్తిరెడ్డి, ప్రత్యేకాధికారి ఎంపీడీఓ శ్రీనివాస్ రెడ్డి, ఏడీఏ రాంచంద్రం, మార్కెట్ కార్యదర్శి వరలక్ష్మి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

-50 వసంతాల తర్వాత కలుసుకున్న చిన్ననాటి మిత్రులు



సమ్మేళనంలో పాల్గొన్న మెట్‌పల్లి జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు

మెట్‌పల్లిటౌన్, సెప్టెంబర్ 16(ఆంధ్రజ్యోతి): పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం మెట్‌పల్లి పట్టణంలోని ఆర్‌ఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఘనంగా జరుపుకున్నారు. 50 వసంతల తర్వత చిన్ననాటి మిత్రులు కుటుంబ సభ్యులతో ఒకచోట కలుసున్నారు. 1974-75 సంవత్సరం పదో తరగతికి చెందిన జడ్పీహెచ్‌ఎస్ మెట్‌పల్లి పాఠశాల విద్యార్థులు మంగళవారం కలుసుకొని పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమకు విద్య నేర్పిన గురువులు గంద్ర ఆనంద్‌రావు, టి.దయనంద్‌రావులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మహాజన్ నర్సింల్, చెట్లపల్లి రవీంధర్‌గౌడ్, ముక్క విజయ్, శివకుమార్, కెఎల్‌వి రమణ, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ బిల్లుల్లో అక్రమాలపై విచారణ

-వార్డు అధికారి సస్పెండ్

కోరుట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ బిల్లుల్లో అక్రమాలకు పాల్పడిన ఓ వార్డు అధికారిని విధుల నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు మంగళవారం మున్సిపల్ కమిషనర్ రవీందర్ ప్రకటించారు. పట్టణంలోని బిలాల్‌పుర కాలనీకి చెందిన ఖతీజా బేగం అనే మహిళకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. లబ్ధిదారు ఖాతాలో నగదు జమ కావడంతో ఆమె నుంచి మున్సిపల్ పట్టణ 21వ వార్డు అధికారి సోహెల్ రూ.15 వేలు వసూలు చేసినట్లు ఆరోపణలు రావడంతో విచారణ చేపట్టినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. ఈ విషయాన్ని లబ్ధిదారు కుమారుడు మున్సిపల్ కమిషనర్‌తో పాటు అధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. దీంతో కమిషనర్ విచారణ చేపట్టగా సోహెల్ లబ్ధిదారు వద్ద చేబదులుగా రూ.15వేలు తీసుకున్నానని తెలపడంతో అతడిపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. లబ్ధిదారుకు డబ్బులు అందించిన తరువాత వార్డు అధికారికి షోకాజ్ నోటీసును జారీ చేసి ఉన్నత అధికారులకు విషయాన్ని తెలిపాడు. ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు వార్డు అధికారి సోహెల్‌పై చర్య తీసుకున్నట్లు కమిషనర్ తెలిపారు.

మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రత్యేక పూజలు

గొల్లపల్లి, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో జరుగుతున్న శ్రీ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవాల్లో మంగళవారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ విశ్వకర్మ ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి ఆశీర్వచనాలు అందించి లడ్డు ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా విశ్వకర్మ సంఘం నాయకులు కొప్పుల ఈశ్వర్‌ను సన్మానించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

మండల కేంద్రంలో అనారోగ్యంతో బాధపడుతున్న బీఆర్‌ఎస్ యూత్ నాయకులు సంధ్య వేణి సతీష్‌ను పరామర్శించారు. అనంతరం అబ్బాపూర్ గ్రామానికి చెందిన జక్కుల తిరుపతి, మోహన్, వెంకన్నల తల్లి శనివారం మృతిచెందగా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో టీఆర్‌ఎస్ మండల శాఖ అధ్యక్షులు జలంధర్, యూత్ అధ్యక్షుడు చెవుల రవీందర్, ఏఎంసీ మాజీ చైర్మన్ కాంపెల్లి హనుమాన్లు, మాజీ వైస్ ఎంపీపీ ఆవుల సత్తయ్య, మాజీ సర్పంచ్ రాజశేఖర్ ఉన్నారు.

క్రీడలతో స్నేహ సంబంధాలు పెంపు




విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎంపీడీవో స్వరూప

కొడిమ్యాల, సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో స్నేహ సంబంధాలు పెంపొందుతాయని ఎంపీడీవో స్వరూప అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మండల స్థాయిలో నిర్వహిస్తున్న ఎస్‌జీఎఫ్ క్రీడల ముగింపు సమావేశం మంగళవారం జరిగింది. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపు ఓటమిలను సమానంగా స్వీకరించాలన్నారు. ఎస్సై సందీప్ మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండాలని కోరారు. విజేతలకు ఎంపీడీవో స్వరూప ఎస్సై సందీప్, ఎంఈవో శ్రీనివాస్, ఎస్‌జీఎఫ్ మండల కన్వీనర్ రాజమల్లయ్య బహుమతులను అందించారు. అండర్ 14 కబడ్డీలో బాలికల విభాగంలో కొడిమ్యాల బాలికల పాఠశాల ప్రథమ బహుమతి సాధించింది. అండర్ 14 బాలుర విభాగంలో జడ్పీహెచ్‌ఎస్ తిప్పయ్యపల్లి ప్రథమ బహుమతి సాధించింది. అండర్17 బాలికల విభాగంలో కొడిమ్యాల బాలికల పాఠశాల ప్రథమ బహుమతి సాధించింది. అండర్ 17 బాలుర విభాగంలో కొడిమ్యాల మోడల్‌స్కూల్ ప్రథమ బహుమతి సాధించింది. ఖోఖో అండర్ 14 వాసవి ఉన్నత పాఠశాల ప్రథమ, బహుమతి సాధించింది. అండర్ 17 బాలికల విభాగంలో నాచుపల్లి ప్రథమ బహుమతి సాధించింది. అండర్ 17 బాలికల విభాగంలో నమిలికొండ ప్రథమ బహుమతి సాధించింది. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు విజయేంద్ర, పీడీలు లక్ష్మీరాంనాయక్, బీరయ్య, శివక్రిష్ణ, అనూప్‌రెడ్డి, గంగజల, అఖిల, మేఘన, నాగరాజు, అహ్మద్, ప్రదీప్, సీనియర్ క్రీడాకారులు లక్ష్మన్, రాజు పాల్గొన్నారు.

విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

ధర్మపురి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బీజేపీ ధర్మపురి పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్, మండల అధ్యక్షులు కుమ్మరి తిరుపతి అన్నారు. ధర్మపురి పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద బీజేపీ ఆధ్వర్యంలో కరపత్రాలను మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1947 లో దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా తెలంగాణ విముక్తి పొందలేదని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్, మండల అధ్యక్షులు కుమ్మరి తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి బెజ్జారపు లవణ్, పట్టణ ప్రధాన కార్యదర్శి తిరుమన్‌దాసు సత్యనారాయణ, సంగి మాధవ్, కామెర ప్రభాకర్, జెల్ల వినోద్, కిరణ్, సుంకు మదుసూధన్, బండారి గణేష్ పాల్గొన్నారు.

మోసపూరిత ప్రకటనపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న సెబీ నిపుణుడు శ్రీనివాస్‌రెడ్డి

జగిత్యాల అగ్రికల్చర్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మోసపూరిత ప్రకటనల పట్ల అప్రమత్తంగా ఉండాలని భారతీయ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డు (ఎస్ఇబీఐ) నిపుణులు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పట్టణంలోని స్థానిక ఎస్‌కేఎన్‌ఆర్ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ, పీజీ కళాశాలలో స్టాక్ మార్కెట్ ఇన్వెస్టిమెంట్‌లపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెట్టుబడులు పెట్టేముందు ఫండమెంటల్ అనాలసిస్, రిస్క్ మేనేజ్‌మెంట్ పద్ధతులు తెలుసుకోవడం, మోసపూరిత ప్రకటనల పట్ల అప్రమత్తంగా ఉండడం ప్రధానం అన్నారు.

ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అశోక్, అధ్యాపకులు అంకం గోవర్ధన్, రజిత, వేణు, లెఫ్టినెంట్ రాజు, లైబ్రేరియన్ సురేందర్, డాక్టర్ సాయి మధుకర్, డా.మహేష్, స్వరూప. గట్టయ్య, కవిత, సుప్రియ, పవన్‌కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్‌స్కూల్‌లో ఫ్రెషర్స్ డే

పెగడపల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పెగడపల్లి మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో మంగళవారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఉల్లాసంగా ఉత్సాహంగా సాగాయి. ఇంటర్‌మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులకు రెండవ సంవత్సరం విద్యార్థులు ఫ్రెషర్స్ పార్టీ నిర్వహించారు. ఇందులో జూనియర్ విద్యార్థులకు స్వాగతం చెప్తూ సీనియర్లకు జూనియర్లకు మధ్య సత్సంబంధాలు ఎలా ఉండాలో భవిష్యత్తులో ఒకరికొకరు సహాయ సహకారాలు అందించుకుంటూ సత్సంబంధాలను కొనసాగించుకోవాలని ఉపాధ్యాయులు సూచించడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు ఆనందోత్సాహాలతో సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలి

కొడిమ్యాల, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామకిష్టాపూర్ కుర్మ సంఘం మిగులు పనికి నిధులు మంజూరు చేయాలని మంగళవారం కుర్మ సంఘం నాయకులు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు వినతిపత్రం అందించారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే త్వరలోనే నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చినట్లు కుర్మ సంఘం నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహిపాల్‌రెడ్డి, రాఘవరెడ్డి పాల్గొన్నారు.